ANN తెలుగు

Follow: @ANNTELUGU

11-11-2025

# మహా పత్రిక

మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 323 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM


టాప్ న్యూస్



## త్రిష ఇంటికి మళ్ళీ బాంబు బెదిరింపులు

- డీజీపీ కార్యాలయానికి మెయిల్

08



## పూనకం వచ్చినట్టు పాడిన శ్రుతి హాసన్

- మహేశ్ బాబు 'గ్లోబ్ ట్రాటర్' చిత్రంపై అప్ డేట్


02



## స్పీకర్ పై సుప్రీంకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్

- ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసు

02



# ఢిల్లీలో ఉగ్రదాడి

## భారీ పేలుళ్లతో దద్దరిల్లిన దేశ రాజధాని


### 13 మంది దుర్మరణం

### మరో 30 మందికి గాయాలు

దేశవ్యాప్తంగా హై అలర్ట్.. హైదరాబాద్ సహా ప్రధాన నగరాలను అలర్ట్ చేసిన కేంద్రం

సంఘటనపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి.. హోంమంత్రి అమిత్ షాకు ఫోన్

ఢిల్లీ రెడ్ ఫోర్ట్ గేట్ నెంబర్ 4 దగ్గర భారీ పేలుళ్లు.. కదిలే కారులో వచ్చి ఘోరం



**హైదరాబాద్, మహా :** దేశరాజధాని ఢిల్లీలోని ఎర్రకోట దగ్గర సోమవారం సాయంత్రం పేలుడు దద్దరిల్లింది. ఈ బాంబు పేలుడులో ఇప్పటి వరకు 13 మంది మృతి చెందగా, 24 మందికి తీవ్రగాయాలు అయ్యాయి. తీవ్రంగా గాయపడిన వారందరిని ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రికి తరలించారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. పేలుడు ధాటికి 8 వాహనాలు ధ్వంసం అయ్యాయి. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఎర్రకోట సమీపంలో నిలిపి ఉంచిన ఓ స్విఫ్ట్ కారులో పేలుడు సంభవించింది.

మిగతా 2లో



05

## కేంద్రంపై ఒత్తిడి చేస్తున్నాం


- కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి.. పంట సేకరణకు ఈ నెల కీలకం
- మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి
- ధాన్యం కొనుగోళ్లలో సమస్యలపై జిల్లా కలెక్టర్లతో మంత్రుల సమీక్ష

## మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అజారుద్దీన్

### పీసీసీ చీఫ్ మహేష్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రుల అభినందనలు



**హైదరాబాద్, మహా:** తెలంగాణ మంత్రి అజారుద్దీన్ ఈరోజు తన శాఖల బాధ్యతలు స్వీకరించారు. సచివాలయంలోని తన ఛాంబర్‌లో కుటుంబ సభ్యుల సమక్షంలో, ముస్లిం మత పెద్దల ప్రార్థనల మధ్య ఆయన బాధ్యతలు చేపట్టారు. ఆయనకు కేటాయించిన మైనార్టీల సంక్షేమం, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖల మంత్రిగా అధికారికంగా విధుల్లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి అజారుద్దీన్ మాట్లాడుతూ, తనపై ఎంతో నమ్మకం ఉంచి ఈ గురుతర బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేస్తానని స్పష్టం చేశారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అజారుద్దీన్‌కు పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, అధికారులు, నేతలు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.








## ప్రతిష్టాత్మకంగా జూబ్లీహిల్స్ ఎన్నికలు

### పంపకాల్లో స్టేట్ రికార్డు.. ఒక పార్టీ వందకోట్లు.. మరో పార్టీ 50 కోట్లు

### మాస్ ఏరియాలో.. ఆఖరి ప్రయత్నాలు.. నేడే పోలింగ్.. అధికారపార్టీ ధీమా



**హైదరాబాద్, మహా:** జూబ్లీహిల్స్ బైపోల్ ను అన్ని రాజకీయపార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష బీఆర్ఎస్ ల మధ్య గట్టిపోటీ నెలకొనగా.. రెండు ప్రధానపార్టీలు పంపకాల్లో పోటీపడ్డట్లు ప్రచారం జరుగుతోంది. ఓ రాజకీయపార్టీ రూ.2,500 చొప్పున దాదాపు 3లక్షల మందికి పంపిణీ చేయగా, మరో పార్టీ 2వేల చొప్పున దాదాపు 2లక్షల మందికి పంపిణీచేసినట్లు తెలుస్తోంది. ప్రజలకు పంపిణీచేయడమే కాకు బూత్ ఖర్చులు, ప్రచార ఖర్చులు అదనం. ఓ రాజకీయపార్టీ ఆఖరిరోజు పంపకమే ఏకంగా వందకోట్ల దాకా చేయడం స్టేట్ రికార్డు. మునుపెన్నడూ తెలంగాణ చరిత్రలో ఈ స్థాయి పంపిణీ జరగలేదన్న చర్చ ఉంది. మాస్ ఏరియా కావడం, పల్స్ చిక్కినట్లే చిక్కినా రిస్క్ తీసుకోవొద్దని భావించడంతో పంపిణీలో తగ్గేదెలే అన్నట్లు దూసుకెళ్ళారన్న చర్చ ఉంది. గతంలో హుజూరాబాద్ లో ఓటుకు రూ.6వేల చొప్పున పంపిణీ అది కొన్ని ప్రాంతాల్లోనే పంచారు. ఓటర్లు పరిమితం. జూబ్లీహిల్స్ లో ఓటర్ల సంఖ్య అధికంగా ఉండడం, సభలు సమావేశాలు బారీ హంగామాకు కూడా అవకాశం లేకపోవడంతో పంపకాలపైనే ప్రధానపార్టీలు డిసైడ్ అయ్యాయి. మరో రాజకీయపార్టీ కూడా ఓటుకు రూ.2వేల చొప్పున, కొన్ని ఏరియాలకు రూ.వేయి చొప్పున పంపిణీచేసినట్లు తెలుస్తోంది. మాస్ ఏరియాలో రాజకీయపార్టీల పంపిణీ దూకుడు చూసి ఓటర్లే నోరెళ్ళబెట్టారు. బైపోల్ బైపోలే.. రావాలి బైపోల్ మళ్ళీ మళ్ళీ అంటూ పలువురు సంబరపడ్డారు. ఇక బంగళవారం ఉదయం నుండి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ జరగనుంది.



# అందెశ్రీ అస్తమయం

## తెలంగాణ జయకేతనం సాహితీశిఖరం


### గుండెపోటుతో హఠాన్మరణం

ప్రధాని మోదీ, సీఎం రేవంత్, కేసీఆర్ సహా ప్రముఖుల సంతాపం

తెలంగాణ సాహితీశిఖరం నేలకూలింది సీఎం రేవంత్ దిగ్భ్రాంతి

నేడు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

**హైదరాబాద్, మహా:** తెలంగాణ సాహితీశిఖరం నేలకూలింది. జయజయహే తెలంగాణ అంటూ రాష్ట్రగీతంతో ఉద్యమానికి ఊతమిచ్చిన ప్రజాకవి.. జనజాతరలో మనగీతం అంటూ ప్రజలను ఏకం చేసిన గొంతుక.. సామాన్యుడిగా మొదలై అసామాన్యుడిగా ఎదిగి .... తెలంగాణ సాంస్కృతిక స్వరవాహికగా మారిన నిప్పుల వాగు అందెశ్రీ ఇక లేరు. ప్రముఖ కవి, రచయిత అందె శ్రీ (64) కన్నుమూశారు. హైదరాబాద్ లాలాగూడలోని తన ఇంట్లో సోమవారం ఉదయం అస్వస్థతకు గురి కాగా, కుటుంబసభ్యులు హుటాహుటిన ఆయనను గాంధీ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు హాస్పిటల్‌కు తీసుకొచ్చేలోపే అందెశ్రీ మృతి చెందినట్లుగా వెల్లడించారు. ఇంట్లోనే తుది శ్వాస విడిచారని స్పష్టం చేశారు. అందెశ్రీ మృతి పట్ల ప్రధాని నరేంద్రమోదీ, సీఎం రేవంత్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు, ఎమ్మెల్యేలు సహా పలువురు సంతాపం వ్యక్తం చేశారు.



## అందెశ్రీతో సీఎంకు ప్రత్యేక అనుబంధం

అందెశ్రీ ఆకస్మిక మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ'ను రాసిన అందెశ్రీ మరణం తెలంగాణ సాహితీలోకానికి తీరని లోటని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో, తెలంగాణ రాష్ట్ర సాధనలో జయ జయహే తెలంగాణ గేయం కోట్లాది ప్రజల గొంతుకై నిలిచిందని గుర్తు చేశారు. అందె శ్రీతో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్మరించుకున్నారు.


ప్రత్యేక కథనం 4లో

02

## అందె శ్రీ మృతిపై ప్రధాని మోదీ సంతాపం

ఆయన మరణం సాంస్కృతిక, మేధో ప్రపంచానికి తీరని లోటు అని వెల్లడి

అందె శ్రీ ఆలోచనలు తెలంగాణ ఆత్మను ప్రతిబింబించాయన్న ప్రధాని



# ఢిల్లీలో ఉగ్రదాడి

(మొదటిపేజీ తరువాయి)

ఈ ఘటనలో 13 మంది మృతి చెందగా, ఈ పేలుడు ధాటికి 24 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. దీనితో క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించారు. ఢిల్లీ రెడ్ ఫోర్ట్ గేట్ నెంబర్ 4 దగ్గర భారీ పేలుళ్లు జరిగాయి. ఈ ఘటనలో అనేక వాహనాలకు మంటలు అంటుకుని దగ్ధమయ్యాయి. భారీశబ్ధాలతో అక్కడివారు వణికిపోయారు. పేలుడు శబ్ధం కొన్ని కిలోమీటర్ల దూరంలోని ఐటీవో వరకు వినబడింది. సిగ్నల్ వైపు నెమ్మదిగా కదులుతున్న ఒక వాహనంలో పేలుడు జరిగందని ప్రత్యక్షసాక్షలు చెబుతున్నారు. ఘటన జరిగిన వెంటనే సమాచారం అందుకున్న పోలీసులతో పాటు అగ్నిమాపక దళాలు అక్కడకు చేరుకున్నాయి. 25కు పైగా అగ్నిమాపక వాహనాలు మంటలను ఆర్పేశాయి. ఈ ఘటనతో ప్రధాని మోదీ కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మరోవైపు అమిత్ షా ఢిల్లీ పోలీస్ కమిషనర్‌తో మాట్లాడారు. ఐబీ డైరెక్టర్‌తో నిరంతరం సంప్రదింపులు చేస్తున్నారు. వెంటనే ఘటనాస్థలికి. ఆస్పత్రికి వెళ్ళి పరిస్థితిని పర్యవేక్షించారు. ఆసుపత్రికి 15 మంది క్షతగాత్రులను తీసుకువచ్చారు. వారిలో 8 మంది మృతి చెందారు. మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. ఒక వ్యక్తి పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉంది." అని ఎల్ ఎన్‌జేపీ ఆసుపత్రి సూపరింటెండెంట్ చెప్పారు. అయితే ఘటనాస్థలంలో పరిస్థితిని చూస్తే ఉద్దేశపూర్వకంగా చేసిన దాడి లాగానే కనిపిస్తోంది. కారులో ఉంచిన పేలుడు పదార్థాలను దూరం నుంచి ఎవరైనా రిమోట్ కంట్రోల్ సాయంతో పేల్చి ఉంటారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఢిల్లీలో పరిస్థితి గందరగోళంగా మారింది. ఢిల్లీ పోలీసులు హై అలెర్ట్ ప్రకటించారు. ఎర్రకోట సహా కీలక ప్రాంతాలకు అదనపు బలగాలను తరలించారు. భారీ ఎత్తున తనిఖీలు చేపట్టారు. ఢిల్లీ పోలీసు విభాగానికి చెందిన ప్రత్యేక దర్యాప్తు బృందం సహా క్లూస్ టీమ్, ఎన్ఐఏ, ఎన్ఎస్‌జీ బృందాలు రంగంలోకి దిగాయి. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో విధులు ముగించుకొని జనాలు ఇళ్లకు చేరే క్రమంలో భారీ పేలుళ్లు జరగ్గా, చాందినీ చౌక్, ఎర్రకోట పరిసరాల్లో విషాదచాయలు అలుముకున్నాయి.

**డెలివరి బాయ్ సజీవదహనం**

ఎర్రకోట మెట్రో స్టేషన్ పార్కింగ్ స్థలం దగ్గర భారీ పేలుడు కారణంగా మంటలు అంటుకొని ఒక డెలివరి బాయ్ సజీవదహనం అయ్యారు. పేలిన కారులో హైగ్రేడ్ ఎక్స్‌ప్లోజివ్ ఉపయోగించినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. ఇప్పటికే కేంద్రహోంమంత్రి అమిత్‌షా ఢిల్లీ పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేలుడుపై దర్యాప్తునకు ఆదేశించారు. అలాగే ఆయన ఢిల్లీ పోలీసు ఉన్నతాధికారులు, ఐబీ చీఫ్‌తో మాట్లాడినట్లు తెలిపారు. ప్రమాదంపై సమాచారం అందిన వెంటనే ప్రధానమంత్రి నరేంద్ర మోడి తనతో మాట్లాడినట్లు అమిత్‌షా వెల్లడించారు.

**ఢిల్లీ పేలుళ్ళతో..**

ఢిల్లీ పేలుళ్లతో ఉత్తర ప్రదేశ్, వాణిజ్య రాజధాని ముంబై మహానగరం అలర్ట్ అయ్యాయి. అయోధ్య రాం మందిర్ దగ్గర భద్రత కట్టుదిట్టం చేశారు. గత కొంతకాలంగా దేశంలోని జమ్మూ కాశ్మీర్, హర్యానా, గుజరాత్ లతో పాటు ఢిల్లీలో పాగా వేసిన ఉగ్రవాద మూకలు ఈ దుశ్చర్యకు పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నారు.

**హైదరాబాద్‌లో హైఅలర్ట్**

ఢిల్లీ పేలుడు ఘటనతో కేంద్రం హైదరాబాద్‌తో సహా పలు నగరాల్లో హైఅలర్ట్ ప్రకటించింది. దీనితో హైదరాబాద్ పోలీసులు అప్రమత్తమై పాతబస్తీలో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నారు. మరోవైపు ఉత్తరప్రదేశ్‌లోని అన్ని మతపరమైన ప్రదేశాలు, సరిహద్దు ప్రాంతాల్లోనూ భద్రత పెంచాలని ఆదేశాలు జారీ చేసినట్లు ఆ రాష్ట్ర డీజీపీ తెలిపారు. సున్నితమైన ప్రాంతాల్లో గస్తీ, తనిఖీలు పెంచాలని ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

**ఢిల్లీ పేలుడుపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటన**

ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన పేలుడు ఘటనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించారు. "సోమవారం రాత్రి 7 గంటల ప్రాంతంలో ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలోని సుభాష్ మార్గ్ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఒక హ్యుందాయ్ ఐ20 కారులో పేలుడు సంభవించింది. ఈ పేలుడు కారణంగా కొంతమంది పాదచారులు గాయపడ్డారని, కొన్ని వాహనాలు దెబ్బతిన్నాయి. ప్రాథమిక నివేదికల ప్రకారం కొంతమంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. పేలుడు సమాచారం అందిన 10 నిమిషాల్లోనే ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్, ఢిల్లీ స్పెషల్ బ్రాంచ్ బృందాలు ఘటనాస్థలానికి చేరుకున్నాయి. ప్రస్తుతం ఎన్ఎస్‌జీ , ఎన్ఐఏ బృందాలు.. ఫోరెన్సిక్ బృందంతో కలిసి సమగ్ర దర్యాప్తు ప్రారంభించాయి. సమీపంలోని అన్ని సీసీటీవీ కెమెరాలను పరిశీలించాలని ఆదేశాలు జారీ చేయడం జరిగింది." అని అన్నారు.



## ఢిల్లీ పేలుళ్ల కేసులో ఇద్దరు అనుమానితుల అరెస్ట్..!

దేశ రాజధాని ఢిల్లీ నగరంలో సోమవారం సాయంత్రం భారీ పేలుడు చోటు చేసుకుంది. ఎర్రకోట గేట్-1కు సమీపంలోని సుభాష్ మార్గ్ సిగ్నల్ వద్ద కారులో పేలుడు చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఇప్పటి వరకు 13 మంది మృతి చెందగా.. 24 మంది గాయపడ్డారని ఢిల్లీ పోలీసులు తెలిపారు. ఈ పేలుడు ఘటనకు సంబంధించి ఇద్దరు అనుమానితులను పోలీసులు అరెస్టు చేశారు. సదరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారని.. పేలుడు ఉద్దేశపూర్వకంగా జరిగిందా? లేదంటే ప్రమాదవశాత్తు జరిగిందా? అనే కోణంలో ఆరా తీస్తున్నట్లుగా సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

# అందె శ్రీ మృతిపై ప్రధాని మోదీ సంతాపం

**ఆయన మరణం సాంస్కృతిక, మేధో ప్రపంచానికి తీరని లోటు అని వెల్లడి**

**అందె శ్రీ ఆలోచనలు తెలంగాణ ఆత్మను ప్రతిబింబించాయన్న ప్రధాని**

**మహా :** ప్రముఖ కవి, జన వాగ్గేయకారుడు అందె శ్రీ మృతి పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణం మన సాంస్కృతిక, మేధో ప్రపంచంలో పూడ్చలేని లోటు అని అభివర్ణించారు. ఈ మేరకు ప్రధాని కార్యాలయం ఆయన సంతాప సందేశాన్ని విడుదల చేసింది. అందె శ్రీ ఆలోచనలు తెలంగాణ ఆత్మను ప్రతిబింబిస్తాయని మోదీ కొనియాడారు. "అందె శ్రీ మరణం మన సాంస్కృతిక, మేధో ప్రపంచంలో పూడ్చలేని లోటు. ఆయన ఆలోచనలు తెలంగాణ ఆత్మను ప్రతిబింబిస్తాయి. ఒక గొప్ప కవి, మేధావి అయిన ఆయన, ప్రజల పోరాటాలకు, ఆకాంక్షలకు, అకుంఠిత స్ఫూర్తికి గొంతుకగా నిలిచారు. ఆయన పదాలకు హృదయాలను కదిలించే శక్తి, అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలను ఏకం చేసే శక్తి, ప్రజల సాంఘిక హృదయస్పందనకి రూపం ఇచ్చే శక్తి ఉన్నాయి. ఆయన సామాజిక స్పృహను, సాహితీ సౌందర్యంతో మిళితం చేసిన విధానం అద్వితీయం. వారి కుటుంబసభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను. ఓం శాంతి" అంటూ మోదీ తన ప్రకటనలో పేర్కొన్నారు.



# పూనకం వచ్చినట్టు పాడిన శ్రుతి హాసన్

**మహేశ్ బాబు గ్లోబ్ ట్రాటర్ చిత్రంపై అప్ డేట్**

**మహా:** సంచారి .. సంచారి.. సాహసమే తన దారి.. శృతిహాసన్ అదరగొట్టేసింది "మీ అందరి కోసం ఒక చిన్న విషయాన్ని వదులుతున్నా. నవంబర్ 15న 'గ్లోబ్ ట్రాటర్' ఈవెంట్‌లో కలుద్దాం" అంటూ దిగ్గజ దర్శకుడు రాజమౌళి చిత్రంలో శ్రుతి హాసన్ పాడిన ఓ పాటను కూడా పంచుకున్నారు. హై పిచ్ లో పూనకం వచ్చినట్టు ఊగిపోతూ శ్రుతి తన గానంతో ఉగ్రరూతలూగించడం ఈ వీడియోలో ఉంది. విడుదలైన కొద్ది సేపట్లోనే ఈసాంగ్ ఇండియాను షేక్ చేస్తోంది. ఈవెంట్‌లో సినిమాకు సంబంధించి 'మును పెన్నడూ చూడని' రీతిలో ఒక విషయాన్ని రివీల్ చేయబోతున్నట్లు కూడా రాజమౌళి వెల్లడించారు. దీంతో ఈ కార్యక్రమంపై అంచనాలు అమాంతం పెరిగిపోయాయి. ఈ ఈవెంట్‌లో సినిమా ఫస్ట్ లుక్ లేదా గ్లింప్స్ విడుదలయ్యే అవకాశం ఉందని అభిమానులు అంచనా వేస్తున్నారు. కాలాన్నే శాసిస్తూ ప్రతిరోజు పరుగేలే.. వేగాన్నే శ్వాసిస్తూ పెనుగాలే తిరిగేలే.. ఖండాలే దాటేస్తూ ఖగరాజై వాలే.. హీరో ఒక సంచారి అని చెప్పుకొచ్చారు. అసలు ఈ సాంగ్ కు శృతి హాసన్ వాయిస్ మాత్రం నెక్స్ట్ లెవెల్ అయితే .. కీరవాణి మ్యూజిక్ తో అదరగొట్టేశాడు అని చెప్పొచ్చు. ప్రస్తుతం ఈ సాంగ్ సోషల్ మీడియాను షేక్ చేస్తోంది.

# స్పీకర్ పై సుప్రీంకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్

**ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసు**

**ఢిల్లీ, మహా :** శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సుప్రీం కోర్టులో ధిక్కరణ పిటిషన్ వేశారు. పార్టీ ఫిరాయించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లలపై నిర్ణయం తీసుకోనందుకు కేటిఆర్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. జూలై 3న కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం మూడు నెలల గడువులోగా పార్టీ ఫిరాయించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై యాక్షన్ తీసుకోవాలి. అయినా పార్టీ ఫిరాయించిన 10 బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని కేటీఆర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. స్పీకర్ కోర్టు తీర్పుని ధిక్కరించారని ఆయన భావించి సుప్రీంకోర్టుకు వెళ్లారు. స్పీకర్ కోర్టు ధిక్కార పిటిషన్‌పై అత్యవసరంగా విచారణ జరపాలని కేటీఆర్ కోరారు. బీఆర్ఎస్ తరపు న్యాయవాది సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్ ధర్మాసనం ఈ పిటిషన్ గురించి ప్రస్తావించారు. సుప్రీం కోర్టు సీజేఐ ఈ పిటిషన్‌పై వచ్చే సోమవారం విచారణ చేపడతామని తెలిపారు. నవంబర్ 23 న సీజేఐ గవాయ్ పదవీ విరమణ ఉంది. ఈనేపథ్యంలో ఈ కేసు అప్పటివరకు సాగదీస్తున్నారని న్యాయవాది మోహిత్ రావు తెలిపారు. నవంబర్ 24 తరువాత కూడా సుప్రీంకోర్టు ఉంటుంది కదా అని సీజేఐ చెప్పుకొచ్చారు.

తెలంగాణలో పార్టీ ఫిరాయించిన పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై స్పీకర్ చర్యలు తీసుకునేలా ఆదేశాలివ్వాలంటూ గతంలో బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, పాడి కౌశిక్ రెడ్డి, వివేకానంద్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్ ప్రకారం ఎమ్మెల్యేల అనర్హతను కోరుతూ దాఖలైన పిటిషన్లను మూడు నెలల వ్యవధిలోగా నిర్ణయించాలని జులై 31న తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. మూడు నెలలు గడిచినా స్పీకర్ ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని బీఆర్ఎస్ పార్టీ నాయకులు తెలిపారు. పిటిషన్ పై విచారణను కోర్టు సోమవారానికి వాయిదా వేసింది.

# హలో బీసీ.. ఛలో ఢిల్లీ

**చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి**

**డిసెంబర్ 10న ఢిల్లీలోని కన్స్టిట్యూషన్ క్లబ్‌లో జాతీయ సదస్సు: రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య**



**హైదరాబాద్, మహా:** స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్ల కోసం చేసిన ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని, చట్టసభల్లో రిజర్వేషన్ల కోసం జాతీయ స్థాయిలో ఉద్యమించాలని రాజ్యసభ సభ్యుడు ఆర్ . కృష్ణయ్య అన్నారు. సోమవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి అజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఆర్ కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ.. చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల సాధన కోసం హలో బీసీ, ఛలో ఢిల్లీకి ఆర్ కృష్ణయ్య పిలుపునిచ్చారు. డిసెంబర్ 10న ఢిల్లీలోని కన్స్టిట్యూషన్ క్లబ్‌లో బీసీల డిమాండ్లపై నిర్వహిస్తున్న జాతీయ సదస్సులో తెలంగాణ, ఏపీ, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు చెందిన నాయకులు పాల్గొంటారని ఆయన తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి బీసీలు అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓబీసీ ప్రధాని ఉన్న ఈ సమయంలోనే, బీసీల హక్కులను సాధించుకోవాలన్నారు. తెలంగాణ ఉద్యమం తరహాలో బీసీ ఉద్యమం ఊపందుకుందని, ఆ ఉత్సాహంతోనే చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు దక్కించుకోవాలని ఆర్ కృష్ణయ్య పిలుపునిచ్చారు.

# ప్రముఖ కవి అందెశ్రీకి కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి నివాళులు

**అందెశ్రీతో అనుభవాలను నెమరువేసుకున్న కేంద్ర మంత్రి**

**అందెశ్రీ మరణం సాహితీ లోకానికి తీరని లోటన్న కిషన్ రెడ్డి**

**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్ర గీత రచయిత, సహజ కవి అందెశ్రీ స్వర్గస్తులు కావడాన్ని తెలంగాణ సమాజం, కవులు, కళాకారులు జీర్ణించుకోలేకపోతున్నారని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనేక విషయాలను ముక్కుసూటిగా చెప్పే గొప్ప వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి అందెశ్రీ అని అన్నారు. వారు రాసిన అనేక పాటలు ప్రజల హృదయాల్లో ఎల్లప్పుడూ నిలిచిపోతాయని తెలిపారు. మాయమైపోతున్నడమ్మ మనిషన్నవాడు అంటూ, జయ జయహే తెలంగాణ వంటి అద్భుతమైన పాటలను తెలంగాణ ఉద్యమ సమయంలో ఆయన పాటలతో లక్షలాది మందిలో స్ఫూర్తి రగిలించారన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో అందెశ్రీతో పాల్గొనే అవకాశం నాకు కలిగిందని, పోరు యాత్రలో చాలా సభల్లో అందెశ్రీ పాల్గొన్నారని గుర్తు చేసుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న నదులపై పరిశోధన చేసి పుస్తకం రాయాలనే సంకల్పంతో ఆయన అనేక పరిశోధనలు చేశారని, ఈ సమయంలో అమెరికాలో వారితో కలిసి పర్యటించే అవకాశం నదులపై చర్చించే అవకాశం లభించిందన్నారు. దురదృష్టవశాత్తు ఆ పుస్తకం పూర్తి కాకుండానే వారు మనకు దూరమయ్యారన్నారు. నరేంద్రమోదీ అంటే అందెశ్రీకి ఎంతో అభిమానమని,



అనేకసార్లు మా ఇంటికి వచ్చి సమకాలీన అంశాలు, రాజకీయాలపై చర్చించుకునేవాళ్లమన్నారు. అలాగే అందెశ్రీ నాకు సలహాలు కూడా ఇచ్చేవారని, చాలా పేదరికం నుంచి, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి.. గ్రామీణ ప్రాంతాల సాహిత్యాన్ని ప్రపంచానికి పరిచయం చేసి, ప్రజల హృదయాలను గెలుచుకున్నారన్నారు. సమాజంలో మార్పు రావాలని, ప్రజల్లో చైతన్యం కలిగించాలని ప్రతి క్షణం ఆలోచించేవారన్నారు.

# టెక్నో–కల్చరల్ ఫెస్టివల్‌కు గ్రీన్ సిగ్నల్

**55 లక్షల రూ. నిధులు మంజూరు చేసిన సర్కార్**

**హైదరాబాద్ వేదికగా 'కల్చరల్ సావరినిటీ త్రూ సినిమా' ఉత్సవం**

**తెలంగాణను కళలకు నిలయ సినిమా కేంద్రంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం: మంత్రి కోమటిరెడ్డి**

**హైదరాబాద్, మహా:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం "తెలంగాణ-నార్త్ ఈస్ట్ ఇండియా కనెక్ట్, టెక్నో-కల్చరల్ ఫెస్టివల్ - కల్చరల్ సావరినిటీ త్రూ సినిమా" అనే విభిన్న సాంస్కృతిక-సినిమాటోగ్రఫీ ఉత్సవం నిర్వహణకు రూ. 55 లక్షల నిధులను మంజూరు చేసింది రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. జి.ఓ.ఆర్.టి.నెం.1551 ప్రకారం, ఈ కార్యక్రమాన్ని తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ నెలలో హైదరాబాద్‌లోని ప్రసాద్ మల్టీప్లెక్స్, హైటెక్స్ కన్వెన్షన్ సెంటర్ వేదికగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నాయకత్వం వహిస్తున్నారు. ఆయన సారథ్యంలో తెలంగాణ ప్రభుత్వం, రాష్ట్ర సినీ-సాంస్కృతిక రంగాన్ని దేశవ్యాప్తంగా విస్తరించాలనే దిశగా ముందడుగు వేస్తోంది. "తెలంగాణను దేశంలోని కళ, సంస్కృతి, సినిమాటోగ్రఫీ రంగాల




కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం. ఈ ఫెస్టివల్ ద్వారా ఈశాన్య రాష్ట్రాలతో సాంస్కృతిక, సృజనాత్మక బంధాలు మరింత బలపడతాయి," అన్నారు. ఈ ఫెస్టివల్‌లో జాతీయ అవార్డు గెలుచుకున్న చిత్రాల ప్రదర్శనలు, ప్యానెల్ చర్చలు, సాంస్కృతిక ప్రదర్శనలు జరుగుతాయి. తెలంగాణ రాష్ట్రం కల్చరల్ ఎక్స్ఛేంజ్‌కి కేంద్ర బిందువుగా ఎదుగుతున్నదని తెలిపారు.

# 730 కోట్లతో సికింద్రాబాద్ స్టేషన్ డెవలప్

**శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ లా రైల్వే స్టేషన్‌ను తీర్దిదిద్దాలనేది నా కల**

**2.70 లక్షల మంది ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా నిర్మాణం.. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

**హైదరాబాద్, మహా:** శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ మాదిరిగానే సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను తీర్దిదిద్దాలనేది తన కల అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను మెట్రో మార్గంతో అనుసంధానం చేయనున్నట్టుగా వెల్లడించారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఆధునీకరిస్తున్నాం. సౌత్ ఇండియాలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. అమృత్ భారత్ పథకం కింద రూ.714 కోట్లతో ఈ స్టేషన్‌ను ఆధునీకరిస్తున్నాం. ఇప్పటివరకు 50 శాతం పనులు పూర్తి అయ్యాయి. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి.' అని కిషన్ రెడ్డి తెలిపారు. ఇప్పుడు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు రోజువారీగా 1,97,000 మంది ప్రయాణికులు వస్తున్నారని కిషన్ రెడ్డి వెల్లడించారు. 2.70 లక్షల మంది ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా నిర్మాణం చేస్తున్నట్టుగా తెలిపారు. గంటకు సుమారు 23 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నా.. పనుల వేగం తగ్గకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. కొత్త నిర్మాణాల్లో భాగంగా సౌత్ మెయిన్ బిల్డింగ్, మల్టీ లెవెన్ కార్ పార్కింగ్, ట్రావెలర్‌తో కూడిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు సాగుతున్నాయన్నారు. సౌత్ సైడ్ బ్లాక్ నిర్మాణం నాలుగు నెల్లలో



పూర్తి అవుతుందని కిషన్ రెడ్డి చెప్పారు. 'మొత్తం పునర్నిర్మాణ పనులను 13 నెలల్లో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చాం. వచ్చే ఏడాది డిసెంబర్ నెలలో ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ స్టేషన్ మూడు ఎకరాల విస్తీర్ణంలో మూడు వేల మంది కూర్చునే విధంగా నిర్మిస్తున్నాం. స్టేషన్లో 26 లిఫ్టులు, 32 ఎస్కలేటర్లు అందుబాటులోకి వస్తాయి. రెండు సబ్ స్టేషన్లు, అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ సిస్టమ్, 5 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్, ఐదు లక్షల లీటర్ల సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ వంటి సదుపాయాలు ఉంటాయి.' అని కిషన్ రెడ్డి తెలిపారు.



# బీహార్ రెండో దశ పోలింగ్

**ఎన్డీఏ, ఆర్ జేడీలకు ప్రతిష్టాత్మకం**

**మహా:** బీహార్ తుదివిడత పోలింగ్ మంగళవారం జరగనుంది. 243 అసెంబ్లీ స్థానాలకు గానూ 121 స్థానాలకు ఈ నెల 6న పోలింగ్ నిర్వహించగా.. రెండో దశలో 122 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరగనుంది. మొత్తం 45,399 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. వీటిలో 40,073 పోలింగ్ కేంద్రాలు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. రెండవ దశలో మొత్తం 1,302 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరిలో 136 మంది (దాదాపు 10 శాతం) మహిళలే. రెండవ దశలో పోలింగ్ జరగనున్న 122 స్థానాలు బీహార్‌లోని మధ్య, పశ్చిమ, ఉత్తర ప్రాంతాల్లో ఉన్నాయి. బీజేపీకి సంప్రదాయకంగా తిర్హుత్, సారణ్, ఉత్తర మిథిలాంచల్ ప్రాంతాలలో గట్టి పట్టు ఉంది. బీజేపీ మిత్రపక్షమైన జేడీయూకు భాగల్‌పూర్ ప్రాంతంలో మంచి ఆదరణ ఉంది. ఇక విపక్ష మహాఘట్‌బంధన్‌కు మగధ్ ప్రాంతంలో బలమైన పునాది ఉంది. ఈ ప్రాంతం పరిధిలో గయ, ఔరంగాబాద్, నావడ, జెహనాబాద్, అర్వాల్ ఉన్నాయి. ఎగ్జిట్ పోల్స్ కూడా మంగళవారం సాయంత్రమే రానున్నాయి.

# ప్రజా ప్రభుత్వంలో మైనార్టీలకు పెద్దపీట

## మౌలానా స్ఫూర్తితో విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు

### అఖిల భారత కాంగ్రెస్ కమిటీకి అధ్యక్షునిగా ఆజాద్ ఎనలేని సేవలు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, మహా:** స్వతంత్ర భారత దేశ తొలి విద్యా శాఖ మంత్రిగా పని చేసి.. దేశ విద్యా రంగానికి పునాదులు వేసిన ఘనత మౌలానా అబుల్ కలాం ఆజాద్ కే దక్కుతుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కొనియాడారు. దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి (జాతీయ విద్యా దినోత్సవం, మైనారిటీ సంక్షేమ దినోత్సవం) సందర్భంగా విద్యారంగ ప్రగతికి ఆజాద్ చేసిన సేవలను ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. సెంట్రల్ అడ్వైజరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ చైర్మన్‌గా, వయోజన అక్షరాస్యత, సార్వత్రిక ప్రాథమిక విద్య, 14 సంవత్సరాల్లోపు బాల బాలికలందరికీ నిర్బంధ ఉచిత విద్య, వృత్తి శిక్షణ తో పాటు యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ ఏర్పాటు వంటి విభిన్న విధానాలతో దేశంలో విద్యారంగ అభివృద్ధికి ఆజాద్ ఎంతగానో కృషి చేశారని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. ఆయన జయంతి రోజును (నవంబరు 11వ తేదీ) జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. మౌలానా ఆజాద్ స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. అందులో భాగంగానే గ్రామీణ, నిరుపేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో నాణ్యమైన ఉచిత విద్య అందించేందుకు ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఐటీఐలను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా అప్ గ్రేడ్ చేశామని, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుతో పాటు ఉపాధ్యాయులు, లెకర్చర్ల నియామకంతో రాష్ట్రంలో విద్యాభివృద్ధికి పాటుపడుతున్నామని సీఎం తెలిపారు.

జాతీయోద్యమంలో పాల్గొనడంతో పాటు అఖిల భారత కాంగ్రెస్ కమిటీకి అధ్యక్షునిగా ఆజాద్ ఎనలేని సేవలు అందించారని సీఎం కొనియాడారు. ఖిలాఫత్ ఉద్యమములో పాల్గొని బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడారని, జాతీయోద్యమములో హిందూ ముస్లిం ఐక్యతను కోరుకొని దేశ విభజనను వ్యతిరేకించారని సీఎం గుర్తు చేశారు. స్వాతంత్ర్యం అనంతరం మైనారిటీలకు గొంతుకగా నిలిచారని, ఆజాద్ జయంతిని మైనార్టీ సంక్షేమ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. ప్రజా ప్రభుత్వంలో మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేసినట్లు తెలిపారు. మైనార్టీల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం నూతనంగా ఇందిరమ్మ మైనార్టీ మహిళా యోజన 'రేవంతన్నా కా సహారా' కింద ఫకీర్, పథకాలు ప్రారంభించి రూ.30 కోట్ల నిధులు కేటాయించినట్లు సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

# ఎస్సీ వర్గీకరణపై రేవంత్ రెడ్డి నిర్ణయం

# నభూతో న భవిష్యత్తు...!

దేశ చరిత్రలో మొట్ట మొదటిసారిగా ఎస్సీ (షెడ్యూల్డ్ కులాలు) వర్గీకరణను అమలు చేసిన రాష్ట్రంగా తెలంగాణ పేరుగాంచింది.ఈ చారిత్రక నిర్ణయం వెనుక రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పాత్ర "నభూతో న భవిష్యత్తు"అనడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. రేవంత్ నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా దీనికి పూర్తిగా సహకరించింది. అయితే సుప్రీం కోర్టు తీర్పుతో సమానత్వం,సామాజిక న్యాయం అంశాలను ముందుగా పెట్టుకుని ఎస్సీ వర్గీకరణపై వేగంగా చర్యలు తీసుకున్న రేవంత్ రెడ్డి కృషి దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

**రేవంత్ ప్రయత్నాలు, అమలు ప్రభావాలు**

ఎస్సీలలో అసమానతలు భారతదేశంలో ఎస్సీలకు 15 శాతం కోటా (రిజర్వేషన్) కేటాయించబడినప్పటికీ,ఈ కేటాయించబడిన భాగాలలో కొన్ని ఉపకులాలు (సబ్‌కాస్ట్స్) ఎక్కువ ప్రయోజనం పొందగా, మిగతావి వెనుకబడ్డాయి. ముఖ్యంగా మదిగలు, మాలలు వంటి ప్రధాన ఉపకులాల మధ్య అసమానతలు దీర్ఘకాలం వివాదాస్పదమైనవి.2024 ఆగస్టు 1న సుప్రీం కోర్టు ఏడు న్యాయమూర్తుల విభాగం 'స్టేట్ ఆఫ్ పంజాబ్ వర్సెస్ డవీందర్ సింగ్' కేసులో వర్గీకరణకు అనుమతి ఇచ్చింది.దీని ఫలితంగా రాష్ట్రాలు తమ ఎస్సీలను ఉపవర్గీకరించి,మరింత న్యాయమైన కోటా కేటాయించవచ్చని చెప్పింది. ఈ తీర్పు దేశవ్యాప్తంగా చర్చలకు దారితీసినప్పటికీ, అమలుకు మొదటి రాష్ట్రంగా తెలంగాణ ముందుంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పాలన ప్రారంభం నుంచి సామాజిక న్యాయాన్ని ప్రాధాన్యతగా చేసుకుని పాలన షురూ చేశారు.అందుకే ఈ అంశంపై వేగవంతమైన చర్యలు తీసుకున్నారు. రేవంత్ రెడ్డి కృషి వేగవంతమైన నిర్ణయం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసుకున్న కొన్ని నెలల్లోనే (డిసెంబర్ 2023),ఎస్సీ వర్గీకరణ అంశాన్ని ముందుగా పెట్టారు.2024 అక్టోబర్ 9న ఆయన క్యాబినెట్ సమావేశంలో 60 రోజుల డెడ్‌లైన్‌ను ప్రకటించారు. దీని ఫలితంగా,సెప్టెంబర్ 12,2024న క్యాబినెట్ సబ్‌కమిటీని ఏర్పాటు చేశారు.ఆ తర్వాత న్యాయమూర్తి బూరా నాగేశ్వరరావు అధ్యక్షతన ఏకాధికారి జ్యుడిషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేసి, 59 ఎస్సీ ఉపకులాలను అధ్యయనం చేయించారు. కమిషన్ నివేదిక 2025 ఫిబ్రవరి 5న సమర్పించగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే దీనిని ఆధారంగా చేసుకుని వర్గీకరణను ప్రకటించారు."ఎస్సీలలో అసమానతలను తొలగించడం మా ప్రభుత్వ ప్రాధాన్యత" అని ఆయన చెప్పారు.మార్చి 17, 2025న తెలంగాణ అసెంబ్లీలో 'తెలంగాణ షెడ్యూల్డ్ కులాలు (రేషనలైజేషన్ ఆఫ్ రిజర్వేషన్స్) యాక్ట్ 2025 బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించారు.చివరికి డా.బీ.ఆర్.అంబేడ్కర్ జయంతి సందర్భంగా 2025 ఏప్రిల్ 14న గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేసి అమలును ప్రారంభించారు. దీనితో తెలంగాణ దేశంలోనే మొదటి రాష్ట్రంగా చరిత్ర సృష్టించింది.

**అమలు వివరాలు మూడు వర్గాలు న్యాయమైన కేటాయింపు**

ఈ యాక్ట్ ప్రకారం తెలంగాణలోని 59 ఎస్సీ ఉపకులాలను మూడు వర్గాలుగా విభజించారు. మొత్తం 15 శాతం ఎస్సీ కోటా లోపలే ఈ కేటాయింపు జరుగుతుంది.గ్రూప్ 1 (అత్యంత వెనుకబడినవి): 15 ఉపకులాలు,1% కోటా, (రత్నాచారి,గొత్తం వంటివి మొత్తం జనాభా 3.288%), గ్రూప్2 (మధ్యస్థ స్థితి) 18 ఉపకులాలు 9% కోటా, (మలలు,వాక్కలిగుల, జనాభా 62.748%) గ్రూప్3 (సాపేక్షంగా మెరుగైనవి) 26 ఉపకులాలు,5% కోటా (మదిగలు,వల్మీకిలు జనాభా మిగతా భాగం) ఈ విభజన కమిషన్ నివేదిక ఆధారంగా జరిగింది ఇది సామాజిక, ఆర్థిక,విద్యా స్థితిని పరిగణనలోకి తీసుకుంది. ఇప్పుడు ఉద్యోగాలు, విద్యావకాశాలు,ఇతర ప్రయోజనాల్లో ఈ కొత్త విధానం అమలవుతోంది.

దేశానికి మార్గదర్శకమైన ఈ నిర్ణయం ద్వారా వెనుకబడిన ఎస్సీ ఉపకులాలు మరింత అవకాశాలు పొందుతాయని నిపుణులు అంచనా. "తెలంగాణ ప్రభుత్వం చేసిన చర్య దేశానికి ఉదాహరణ" అని ఒక మంత్రి పేర్కొన్నారు.ఇప్పటికే ఇతర రాష్ట్రాలు (ఆంధ్రప్రదేశ్, పంజాబ్) ఈ మోడల్‌ను అనుసరించాలని చర్చిస్తున్నాయి.అయితే కొన్ని మదిగ ఉపకులాల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది.కానీ,ప్రభుత్వం చర్చల ద్వారా అభ్యంతరాలను పరిష్కరించాలని భావిస్తోంది.రేవంత్ రెడ్డి పాలనలో ఇది మాత్రమే కాదు,కులాభివృద్ధి సర్వే, మహిళా హక్కులు వంటి ఇతర సామాజిక చర్యలు కూడా దేశవ్యాప్తంగా మార్గదర్శకాలుగా మారాయని చెప్పడంలో సందేహ పడాల్సిన అవసరం లేదు."అంబేడ్కర్ స్వప్నాలు అమలు చేయడమే మా లక్ష్యం" అని ముఖ్యమంత్రి చెప్పుకోవడాన్ని నేను సామాజిక స్పృహకు దర్పణంగా చూడాలి.ఈ చారిత్రక నిర్ణయం తెలంగాణ సామాజిక న్యాయ ప్రయాణంలో మైలురాయిగా నిలుస్తుంది.రేవంత్ రెడ్డి కృషి భవిష్యత్ తరాలకు ప్రేరణగా మారనుంది.



- గంట సోమన్న,
సీనియర్ జర్నలిస్ట్

# రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీ భారీ విరాళాలు

## తిరుమల అన్నప్రసాదం ట్రస్టుకు రూ.100 కోట్ల విరాళం

### 2 లక్షల మందికి అన్నప్రసాదం అందించేలా కొత్త వంటశాల

### రాజస్థాన్‌లోని నాథ్‌ద్వారాకు రూ.50 కోట్లకు పైగా విరాళం

### కేరళలోని గురువాయూర్ ఆస్పత్రికి తొలి విడతగా రూ.15 కోట్లు

### ఒక్కరోజే మూడు ప్రముఖ ఆలయాలను సందర్శించిన అంబానీ



**ముంబై, మహా :** ప్రముఖ పారిశ్రామికవేత్త, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేశ్ అంబానీ తన దాతృత్వాన్ని మరోసారి చాటుకున్నారు. ఆదివారం ఒక్కరోజే మూడు ప్రముఖ ఆలయాలను సందర్శించి, ప్రజాసేవ కార్యక్రమాల కోసం భారీ విరాళాలు ప్రకటించారు. తిరుమల, కేరళలోని గురువాయూర్, రాజస్థాన్‌లోని నాథ్‌ద్వారా ఆలయాలకు ఆయన రూ.165 కోట్లకు పైగా విరాళాలను ప్రకటించి వార్తల్లో నిలిచారు. వివరాల్లోకి వెళితే... ఆదివారం వేకువజామున సుప్రభాత సేవ అనంతరం ముఖేశ్ అంబానీ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా తిరుమలలో నిత్యం 2 లక్షల మందికి అన్నప్రసాదాలు తయారు చేసేందుకు వీలుగా, అత్యాధునిక సౌకర్యాలతో కూడిన కొత్త శాటిలైట్ కిచెన్ (వంటశాల) నిర్మాణానికి రూ.100 కోట్లు విరాళంగా ప్రకటించారు. ఈ కొత్త వంటశాలను అన్నప్రసాదం ట్రస్టుకు అంకితం చేస్తున్నామని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సహకారంతో ఈ పవిత్ర కార్యక్రమంలో భాగస్వాములు కావడం తమకు లభించిన మహాభాగ్యమని రిలయన్స్ సంస్థ ఒక ప్రకటనలో పేర్కొంది. అనంతరం ఆయన రాజస్థాన్‌లోని నాథ్‌ద్వారా ఆలయాన్ని సందర్శించారు. అక్కడ భక్తుల సౌకర్యార్థం యాత్రికుల సముదాయాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. రానున్న మూడేళ్లలో పూర్తికానున్న ఈ ప్రాజెక్టు కోసం రూ.50 కోట్లకు పైగా ఖర్చు చేయనున్నట్లు ప్రకటించారు. ఇందులో భాగంగా తొలి విడతగా రూ.15 కోట్లను విరాళంగా అందజేశారు. అలాగే కేరళలోని గురువాయూర్ శ్రీకృష్ణ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి తనవంతు సహాయం ప్రకటించారు. తొలి విడతగా రూ.15 కోట్ల చెక్కును ఆలయ అధికారులకు అందజేశారు. ఒకే రోజు మూడు ఆలయాల్లో అన్నదానం, వసతి, వైద్యం వంటి సేవా కార్యక్రమాలకు అంబానీ భారీగా విరాళాలు ఇవ్వడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## మహిళలు, చిన్నారుల భద్రత విషయంలో

# రాజీపడేదే లేదు

### హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్.. మహిళా భద్రతా విభాగం పనితీరుపై సమీక్ష




**హైదరాబాద్, మహా :** మహిళలు, చిన్నారుల భద్రత విషయంలో రాజీపడేదే లేదని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్ స్పష్టం చేశారు. మహిళల భద్రత, రక్షణ అనేది సామాజిక బాధ్యత అని ఆయన గుర్తు చేశారు. సోమవారం మహిళా భద్రత విభాగం పనితీరుపై సీపీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆ విభాగంలోని మహిళా పోలీస్ స్టేషన్లలో నమోదవుతున్న కేసులను ఆరా తీశారు. షీటీమ్స్, భరోసా, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, జువైనల్, తదితర విభాగాల పోలీస్ అధికారులతో మాట్లాడి వారి పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం మహిళా భద్రత విషయంలో వ్యవహరించాల్సిన తీరుపై దిశానిర్దేశం చేశారు. మహిళలు బాధతో పోలీస్ స్టేషన్లకు వస్తారని, వారి ట్ల మానవతా దృక్పదంతో వ్యవహరించాలని సూచించారు. అన్యాయం జరిగిందని వచ్చే బాధిత మహిళకు తాము అండగా ఉన్నామనే భరోసా కల్పించాలన్నారు. కేవలం కేసులు నమోదు చేసి వదిలేయొద్దని, సమగ్రంగా దర్యాప్తు చేయాలన్నారు. పొక్సో, అత్యాచార కేసుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళా భద్రతపై అవగాహన కల్పించాలని, చిన్నపిల్లలకు గుడ్ టచ్ - బ్యాడ్ టచ్, స్వీయరక్షణ విషయాలు నేర్పాలని సూచించారు. ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ అప్పుడే కాకుండా మిగతా సమయాల్లోనూ వీధి బాలలు, వెట్టిచాకిరి, పరిశ్రమల్లో మగ్గుతున్న బాలకార్మికులను రక్షించాలని ఆదేశించారు. ఆడపిల్లల జోలికి వస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, నిందితులపై హిస్టరీ షీట్స్ తెరుస్తామని హెచ్చరించారు. వారికి పాస్‌పోర్ట్ మంజూరు కాదని, ప్రభుత్వ ఉద్యోగాలు రావని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు సీపీ (క్రైమ్స్) శ్రీనివాస్, డీసీపీ (మహిళా భద్రత) లావణ్య నాయక్ పాల్గొన్నారు.






ANN తెలుగు
మహా పత్రిక
మంగళవారం, హైదరాబాద్
11-11-2025

# తెలంగాణ ఆత్మ గీతం.. అందెశ్రీ



**మహా ప్రత్యేకం:** ఆయన తెలంగాణ మట్టి మనిషి, పాటల పందిరి. నిరక్షరాస్యుడై ఉండి కూడా తన అనుభవాన్ని, అక్షరాలను కలుపుకొని, వేలాది మంది హృదయాలను కదిలించిన మహా కవి డా. అందెశ్రీ. తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటానికి తన పాటను ఆయుధంగా మలిచి, కోట్లాది ప్రజల గళంగా మారిన అరుదైన వ్యక్తిత్వం ఆయనది. ఆయన జీవితం ఒక పోరాటం, తన పాట ఒక ఉద్యమం. వారి బాల్యం, పేదరికం, నిరక్షరాస్యత వంటి అడ్డంకులను అధిగమించి, తన అనుభవాన్నే విద్యగా మార్చుకొని, తెలుగు సాహిత్యంపై, తెలంగాణ సాంస్కృతిక చరిత్రపై చెరగని ముద్ర వేశారు. ఆయన పాట "జయ జయహే తెలంగాణ" ఇప్పుడు కేవలం ఒక గీతం కాదు, తెలంగాణ ప్రజల కల, పోరాటం, విజయం... అంతకు మించి ఒక శాశ్వత వారసత్వం.

## జీవిత ప్రస్థానం..

పద్యాలు, పాటల ద్వారా తెలంగాణ ఆత్మను ప్రతిబింబించిన అందెశ్రీ జీవిత కథ ఎందరికో స్ఫూర్తిదాయకం. ఆయన అసలు పేరు అందె ఎల్లయ్య. 1961, జూలై 18న వరంగల్ జిల్లా (ప్రస్తుతం సిద్దిపేట జిల్లాలో ఉంది)లోని రేబర్తి గ్రామంలో జన్మించారు. దురదృష్టవశాత్తూ, అందెశ్రీ అనాథగా పెరిగారు, కనీసం ప్రాథమిక విద్య కూడా అభ్యసించలేదు. బడి ముఖం చూడకపోయినా, ఆయన ప్రకృతిని తన గురువుగా స్వీకరించారు. పక్షుల కిలకిలారావాలు, మట్టి వాసన, గాలి సోయగాలు ఆయన కవిత్వానికి ప్రేరణగా నిలిచాయి. గొర్రెల కాపరిగా, ఆ తర్వాత భవన నిర్మాణ కార్మికుడిగా కుటుంబ పోషణ భారాలు మోస్తూనే, ఆయన తనలోని కవిత్వ ప్రతిభను పెంచుకున్నారు. ఆయన అశువు కవిత్వంలో దిట్ట. ఒకానొక సమయంలో ఆయన పాడుతుండగా విన్న శృంగేరి మఠానికి చెందిన స్వామీ శంకర్ మహారాజ్ ఆయన ప్రతిభను గుర్తించి, చేరదీసి, ఆయన పేరును అందెశ్రీగా మార్చారు. చదువుకోకపోయినా, ఆయన సాహిత్య సేవకు గుర్తింపుగా కాకతీయ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. అంతేకాక, ఆయన సినీ రంగంలో 'గంగ' సినిమాకు నంది పురస్కారం కూడా అందుకున్నారు. నిరక్షరాస్యుడైన ఈ మహాకవి ప్రస్థానం, ప్రకృతి అనుభవంతో అక్షరాలై, ప్రజల గుండెల్లో నిలిచిన గాథ.

## రచనలు, పాటల ప్రస్థానం..

అందెశ్రీ ప్రధానంగా ఆశువుగా కవిత్వం చెప్పడంలో, రాయడంలో దిట్ట. ఆయన పాటల్లో తెలంగాణ గ్రామీణ జీవితం, ప్రకృతి, శ్రమజీవుల కష్టాలు, మానవ సంబంధాలు, అన్యాయంపై తిరుగుబాటు స్పష్టంగా కనిపిస్తాయి. తెలంగాణ రాష్ట్ర గీతం ఆయన రచనల్లో అత్యంత ముఖ్యమైనది, చిరస్మరణీయమైనది "జయ జయహే తెలంగాణ జననీ జయ కేతనం". ఈ పాట తెలంగాణ ఉద్యమానికి అధికారిక గీతంగా నిలిచింది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత, 2024 లో తెలంగాణ ప్రభుత్వం ఈ గీతాన్ని రాష్ట్ర గీతంగా అధికారికంగా ప్రకటించింది.


## అందెశ్రీ ప్రసిద్ధ పాటలు..

- "మాయమై పోతున్నడమ్మో మనిషన్నవాడు...": మారుతున్న మానవ సంబంధాలు, కనుమరుగవుతున్న మానవత్వం గురించి రాసిన ఈ పాట తెలుగు ప్రజలను బాగా కదిలించింది. ఇది ఎర్ర సముద్రం వంటి విప్లవాత్మక సినిమాల్లో కూడా ఉపయోగించబడింది.
- "పల్లె నీకు వందనములమ్మో..."
  : పల్లె జీవనాన్ని, ప్రకృతి అందాలను కీర్తిస్తూ రాసిన గీతం.
- "గలగల గజ్జెల బండి..."
- "కొమ్మ చెక్కితే బొమ్మరా... కొలిచి మొక్కితే అమ్మరా..."
- ఆడ బ్రతుకు
- అల్లంత దూరం చూడు
- ఆ పాము పైతల మీద
- చూడు తెలంగాణ

## పుస్తకాలు..

- తెలంగాణ ఉద్యమ పాటల సంకలనం 'నిప్పల వాగు' (1,365 పేజీల పుస్తకం) కు సంపాదకత్వం వహించారు.
- పాటల సంఖ్య: ఆయన 3,000 కు పైగా పాటలు/కవితలు రచించారని చెబుతారు.








## అవార్డులు, గౌరవాలు...

| పురస్కారం పేరు | సంవత్సరం | వివరణ |
|---|---|---|
| నంది పురస్కారం | 2006 | 'గంగ' సినిమాలోని పాటలకు ఉత్తమ గేయ రచయితగా. |
| గౌరవ డాక్టరేట్ | 2008 | కాకతీయ యూనివర్సిటీ (వరంగల్) నుండి |
| గౌరవ డాక్టరేట్ | 2014 | అకాడమీ ఆఫ్ యూనివర్సల్ గ్లోబల్ పీస్ (వాషింగ్టన్ డి.సి.) నుండి 'ప్రపంచ కవి' బిరుదుతో. |
| దాశరథి సాహితీ పురస్కారం | 2015 | - |
| డా. రావూరి భరద్వాజ సాహితీ పురస్కారం | 2015 | - |
| సుద్దాల హనుమంతు-జానకమ్మ జాతీయ పురస్కారం | 2022 | - |
| దాశరథి కృష్ణమాచార్య సాహితీ పురస్కారం | 2024 | - |
| రూ. 1 కోటి నగదు పురస్కారం | 2025 | తెలంగాణ రాష్ట్ర గీతాన్ని అందించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా (రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా). |



## రాష్ట్ర ప్రభుత్వాలతో అనుబంధం

తెలంగాణ ఉద్యమానికి ఆయన చేసిన కృషికి గాను, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, సీఎం రేవంత్ రెడ్డి ఇద్దరూ ఆయనకు గౌరవం ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయనను సన్మానించి, నగదు పురస్కారం కూడా అందించారు. ఆయన వ్యక్తిగతంగా ఏదైనా ఒక రాజకీయ పార్టీలో పనిచేసినట్లుగా లేదా ఒక పార్టీకే కట్టుబడి ఉన్నట్లుగా కాకుండా, తెలంగాణ భావజాలానికి తన రచనల ద్వారా దగ్గరయ్యారు. అందువల్ల, అందెశ్రీ తెలంగాణ ఉద్యమ కవిగా, అన్ని రాజకీయ పార్టీల నాయకుల గౌరవాన్ని, మద్దతును పొందారు.

## ప్రజాకవి, ప్రకృతి కవి అనే బిరుదు..


ప్రజాకవి, ప్రకృతి కవి అనే బిరుదులతో కూడా ఆయన ప్రసిద్ధి చెందారు. గౌరవ డాక్టరేట్ 'లోకకవి' బిరుదుగా అకాడమి ఆఫ్ యూనివర్సల్ గ్లోబల్ పీస్, వాషింగ్టన్ డి.సి. వారిచే 2014లో సన్మానించబడింది.

## తెలంగాణ ఉద్యమంలో పాత్ర..

అందెశ్రీ జీవితం తెలంగాణ పోరాట చరిత్రతో పాత్రగా నిలిచింది. కవిత్వం సామాన్యుడి కంఠధ్వని, ఆయన పదాలు తెలంగాణ ఆత్మ, చదువు లేకున్నా, చైతన్యం నిండిన మాటలు రాయగల సామర్థ్యం ఆయనకు ఉన్న శక్తి. అందుకే ఆయన తెలంగాణలో మాత్రమే కాదు, మొత్తం తెలుగు సాహిత్య లోకంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించారు. ఆయనను రాష్ట్ర, జాతీయ స్థాయిలో గర్వంగా "తెలంగాణ కవి"గా పిలిచింది."జయ జయహే తెలంగాణ... జననీ జయకేతనం" అనే గీతం తెలంగాణ ఉద్యమంలో ప్రజలందరి హృదయాలలో నిండి, ఉద్యమానికి ఒక సాంస్కృతిక శక్తిగా నిలిచింది. ఈ గీతాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారిక రాష్ట్ర గీతంగా ప్రకటించింది. తన పాటలు మరియు సాహిత్యంతో తెలంగాణ పది జిల్లాల ప్రజలలో ఉద్యమ స్ఫూర్తిని రగిలించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు.

## ధూంధాం కార్యక్రమ రూపశిల్పి..

ఆయన పాటలు సామాన్య ప్రజల జీవితంలోని కష్టాలు, ఆకాంక్షలు తెలంగాణ ఆత్మగౌరవాన్ని సరళమైన, శక్తివంతమైన భాషలో వ్యక్తీకరించాయి, తద్వారా ప్రజలందరితో సులభంగా మమేకమయ్యారు. ధూంధాం కార్యక్రమ రూపశిల్పి: ఆయన 'ధూంధాం' కార్యక్రమ రూపశిల్పిగా కూడా పనిచేశారు, ఇది సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ఉద్యమ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సహాయపడింది.



## అతని పాట

ఒక కాలముండేది
అతని పాటలతో ఇల్లు పొద్దు పొడిసేది

ఒక కాలముండేది
అతను నోటికి చెయ్యడ్డం పెట్టుకుని పాడే
ఓ జీర గొంతు
మా యూనివర్సిటీ గదుల్లో మారుమోగేది

ఓ కాలముండేది
అతని పాట
ఉద్యమాలను వీధుల్లో కవాతు చేయించేది

అలగా బతుకు నుండి
అంతర్జాతీయ వేదికల దాకా
పాటను కై గట్టిన అతని గొంతు
ఈ పొద్దు మూగబోయింది

యిక
అతను లేని కాలమంతా
అతని పాట అతడ్ని మననం చేస్తుంది

అరుణాంక్ లత

# కేంద్రంపై ఒత్తిడి చేస్తున్నాం

కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి.. పంట సేకరణకు ఈ నెల కీలకం

మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి

ధాన్యం కొనుగోళ్లలో సమస్యలపై జిల్లా కలెక్టర్లతో మంత్రుల సమీక్ష



**హైదరాబాద్, మహా:** ధాన్యం కొనుగోళ్లలో సమస్యలపై జిల్లా కలెక్టర్లతో నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సీఎస్ రామక్రిష్ణారావు సమీక్ష చేశారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో జరిగిన ఈ సమీక్షలో పత్తి, మొక్కజొన్న, సోయా చిక్కుడు కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్ల అభిప్రాయాలు తెలుసుకున్నారు. మొక్కజొన్న కొనుగోలులో ఎకరాకు 18.5 క్వింటాళ్ల నుంచి 25 క్వింటాళ్ల వరకు పరిమితి పెంచడం వల్ల రైతులు సంతోషంగా ఉన్నారని జిల్లా కలెక్టర్లు మంత్రి తుమ్మల నాగేశ్వర రావుకు తెలిపారు. పత్తి కొనుగోలులో ఎల్ 1 ఎల్ 2 నిబంధనల వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఎకరాకు 7 క్వింటాళ్ల పత్తి మాత్రమే కొనుగోలు చేయాలనే సీసీఐ నిబంధన ఎత్తివేసి, 12 క్వింటాళ్ళు కొనుగోలు చేయాలని కేంద్ర ప్రభుత్వం మీద రాష్ట్రప్రభుత్వం ఒత్తిడి తెస్తుందని మంత్రి తెలిపారు. వర్షాల వల్ల రంగుమారిన సోయా చిక్కుడు కొనుగోలు చేయాలని కేంద్రానికి ప్రతిపాదన పంపినట్లు జిల్లా కలెక్టర్లకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. పంటల సేకరణకు ఈ నవంబర్ నెల కీలకమని జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఈ సందర్భంగా దిశానిర్దేశం చేశారు.

## సీసీఐ నిబంధనలు ఎత్తివేయాలని బిఆర్ఎస్ నిరసన



**ఆమనగల్లు, మహా:** పత్తి రైతులకు శాపంగా మారిన సీసీఐ నిబంధనలు ఎత్తివేయాలని బిఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్ డిమాండ్ చేశారు.ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లిలోని ఎన్డిటీ పత్తి మిల్లు వద్ద బిఆర్ఎస్ శ్రేణులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పత్య నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం కిసాన్ యాప్ ద్వారా ఎకరాకు 7 క్వింటాళ్ల పత్తి మాత్రమే కొనుగోలు చేయాలని కొత్త నిబంధన తేవడంతో రైతులు పత్తి అమ్ముకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎకరాకు 7 క్వింటాళ్ల పత్తి మాత్రమే కొనుగోలు చేయాలని కొత్త నిబంధన తేవడంతో నిరక్షరాస్యులుగా ఉన్న పత్తి రైతులు స్మార్ట్ ఫోన్ లేక దాన్ని వాడటం రాక కపాస్ కిసాన్ యాప్ ద్వారా ఏ విధంగా పత్తి అమ్ముకోవాలో తెలియక రైతులు అయోమయంలో పడ్డారన్నారు. ఎకరానికి ఏడు క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తామంటే మిగతా పత్తి ఎక్కడ అమ్ముకోవాలో చెప్పాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.అధిక వర్షాలకు పంటలు పూర్తిగా నష్టపోయి నల్లబడ్డ పత్తిని అమ్ముకుని దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్న రైతులకు కేంద్ర ప్రభుత్వం దుర్మార్గమైన యాప్ ద్వారాపత్తి కొనుగోలు చేయాలని చెప్పడం రైతుల పట్లకక్షపూరితంగా వ్యవహరిస్తున్నా విమర్శించారు. అధిక వర్షాలకు పూర్తిగా పాడైపోయిన పంటలకు ఎకరానికి 40 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రోజు వర్షాలు కురవడం వల్ల పత్తి తడుస్తుందని తేమ శాతంతో సంబంధం లేకుండా మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేసి రైతులు ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చుక్క నిరంజన్ గౌడ్, మాజీ ఎంపీటీసీ సరిత పంతునాయక్, బిఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షులు వద్దె వెంకటేష్, మాజీ డైరెక్టర్ రమేష్ నాయక్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గన్య నాయక్, బిఆర్ఎస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు రమేష్ నాయక్, ఎస్సీ సెల్ అధ్యక్షులు లండం యాదయ్య, రంగయ్య, వరికుప్పల గణేష్, మహేష్ నేత, పంతు నాయక్, సోమ్లా నాయక్, నరేందర్ రెడ్డి, వెంకటయ్య, మహేష్, గణేష్ నాయక్, రైతులు,రాములు, రాజు, జంగమ్మ, అలివేలు, లక్ష్మి, కృష్ణయ్య, శివ, మల్లేష్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రైన్ నిర్మించకపోతే ధర్నా చేపడతాం

కమిషనర్ కు వినతి పత్రం అందజేసిన కార్పొరేటర్



**వరంగల్ మహా;** వరంగల్ తూర్పు నియోజకవర్గం 40వ డివిజన్ లోని ఉప్పరోని కుంటలో నిలిచిపోయిన బాక్స్ డ్రైన్ నిర్మాణానికి బల్దియా టౌన్ ప్లానింగ్ అధికారులు మార్కింగ్ ఇప్పటివరకు చేపట్టలేదు. ఈ నేపథ్యంలో ఈనెల 23వ తేదీ లోపు మార్కింగ్ చేయకుంటే 24వ తేదీన గ్రేటర్ వరంగల్ మహానగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం ఎదుట డివిజన్ ప్రజలతో పెద్ద ఎత్తున ధర్నా చేపడాతామని స్థానిక డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. ఈ సందర్భంగా సోమవారం జిడబ్ల్యూఎం సి లో నిర్వహించిన ప్రజావాణి లో కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రంగశాయి పేట నుండి వచ్చు మురుగునీరు, వర్షం నీరు ఉప్పరోనికుంట నుండి ఎస్టిపి కి వెళ్ళు డ్రైనేజీ నిర్మాణం సరిగ్గా లేకపోవడం వల్ల ఉర్సు హిందూ స్మశానవాటిక లోకి తాళ్లపద్మావతి కాలేజీ డీకే నగర్ కాలనీ తో పాటు కొత్త కుమ్మరి వాడ ఉప్పరోని కుంట ప్రాంతాలన్ని జలమయమవుతున్నాయన్నారు. కాగా ఉర్సు హిందూ స్మశాన వాటికలో అంత్యక్రియలు జరపడానికి వస్తున్న స్థానిక ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కనీసం నిలబడడానికి కూడా చోటు లేకుండా ఉంటుందని స్మశాన వాటిక మొత్తం బురద నీటితో నిండి ఉంటుందని గత మూడు సంవత్సరాల నుండి టౌన్ ప్లానింగ్ అధికారులకు తెలిపిన పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా స్మశాన వాటిక కాలనీలు కాలేజీలు ఇండ్లు మునిగిపోతున్నాయన్నారు, ఇప్పటికైన బల్దియా కమిషనర్ చొరవ తీసుకొని టౌన్ ప్లానింగ్ అధికారుల చే మార్కింగ్ చేయించి డ్రైనేజీ పనులు ప్రారంభించాలని పేర్కొన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని ఆయన హెచ్చరించారు.

## సుప్రీం కోర్టు మార్గదర్శకాలతో కార్యాచరణ సిద్ధం చేయాలి

నగర మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్ పాయ్




**వరంగల్ మహా;** గ్రేటర్ వరంగల్ నగరంలో జన సంచార ప్రాంతాల్లో వీధి కుక్కలు ఉండకుండా సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా కార్యాచరణ (యాక్షన్ ప్లాన్)సిద్ధం చేయాలని నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో వీధి కుక్కల నియంత్రణ పై ఏర్పాటు చేసిన సమావేశం లో కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి పాల్గొని సమర్థవంతం గా నిర్వహించుటకు మేయర్ తగు సూచనలు చేశారు. ఈ సందర్భం గా మేయర్ మాట్లాడుతూ సుప్రీం కోర్టు నిబంధనలకు అనుగుణంగా నగరం లో జన సమూహ ప్రాంతాలైన పాఠశాలలు రైల్వే ,బస్ స్టేషన్లు ,ఆసుపత్రులు పార్కులు, ఆలయాలు తదితర ప్రాంతాల్లో వీధి కుక్కలు సంచరించకుండా తగు చర్యలు చేపట్టాలని ఇటీవల సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసిందని, అందుకు అనుగుణం గా అనిమల్ వెల్ఫేర్ బోర్డు ఆఫ్ ఇండియా (ఏ డబ్ల్యూ బి ఐ)వారి సూచనలను పరిగణలోకి తీసుకొని బల్దియా వ్యాప్తంగా 66 డివిజన్ లలో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయడానికి ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ తో పాటు శానిటేషన్ విభాగాలు సమన్వయం తో పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమం లో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, ఎస్ ఈ సత్యనారాయణ, సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి, సి హెచ్ ఓ రమేష్, ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, ఎం హెచ్ ఓ డా.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## భారత సేవాశ్రమ సంఘ్ ఆధ్వర్యంలో సహాయక కార్యక్రమం

ప్రారంభించిన వరంగల్ జిల్లా కలెక్టర్



**వరంగల్ మహా;** భారత సేవాశ్రమ సంఘ్, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో వరంగల్ ప్రాంతంలోని తుఫాన్ మోంథా ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు అండగా సహాయక కార్యక్రమాన్ని ప్రారంభించింది. సోమవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బాధితులకు సహాయార్థం వస్తువులను పంపిణీ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖిలా వరంగల్ మండలం ఎన్ ఎన్ నగర్, మైసయ్య నగర్ వరంగల్ మండలంలోని ఎన్టీఆర్ నగర్, ఎస్సీ కాలనీ, ఎస్ ఆర్ నగర్, ప్రాంతాల్లో తుఫాన్ బాధితులకు భారత సేవాశ్రమ సంఘ్ ద్వారా అవసరమైన వస్తువులు అందించడం అభినందనీయమని అన్నారు. భారత సేవాశ్రమ సంఘ్ సెక్రటరీ స్వామి మునీశ్వరానంద మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు 1000 టి షర్ట్స్ ,1000 చీరలు, 1000 ధోతీలు, బిస్కెట్లు తదితర వస్తువులను పంపిణీ చేస్తున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓ సుమా, రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఇ.వి. శ్రీనివాస్ రావు, ఏఓ విశ్వప్రసాద్, తహసీల్దార్లు శ్రీకాంత్, ఇక్బాల్, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన జిల్లా కలెక్టర్




**హన్మకొండ మహా;** డీడీజీ (స్టేట్స్), జోనల్ రిక్రూటింగ్ ఆఫీస్, చెన్నై డైరెక్టర్ రిక్రూటింగ్, ఏఆర్ఓ సికింద్రాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించ బడుతున్న ఆర్మీ రిక్రూట్ మెంట్ ర్యాలీ సోమవారం ఉదయం హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా హన్మకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సుమారు ఉదయం 2:30 గంటలకు సైన్యాధికారుల సమక్షంలో ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆదిలాబాద్ వనపర్తి జిల్లాల అభ్యర్థులకు రన్నింగ్ పోటీలు నిర్వహించారు. ఈ రెండు జిల్లాల నుండి 794 మంది వ్రాత పరీక్షలో అర్హత సాధించగా, 624 మంది హాజరై హనుమకొండ జేఎన్ఎస్ స్టేడియంలో ఫిజికల్ ఫిట్నెస్ తో పాటు ఇతర పరీక్షల్లో పాల్గొన్నారు. సైన్యాధికారులు తెలిపిన ప్రకారం, తెలంగాణ రాష్ట్రంలోని మొత్తం 33 జిల్లాల అభ్యర్థులు ఇప్పటికే వ్రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించి, నవంబర్ 10 నుండి 22 వరకు ఫిజికల్, ఫిట్నెస్, మెడికల్ పరీక్షలను హనుమకొండ జేఎన్ఎస్ స్టేడియంలో ఎదుర్కొనున్నారు. ఈ కార్యక్రమానికి సైన్యాధికారులు, జిల్లా యువజన, క్రీడా అధికారి అశోక్ కుమార్ గుగులోతు ఇతర గణ్యులు హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశాల మేరకు ర్యాలీ సాఫీగా సాగేందుకు జేఎన్ఎస్ స్టేడియంలో విస్తృత ఏర్పాట్లు చేయబడ్డాయి. ఒక ఫైర్ ఇంజిన్ సిద్ధంగా ఉంచగా, మరొకటి రిజర్వ్‌లో ఉంచారు. అత్యవసర వైద్య సేవల కోసం రెండు 108 అంబులెన్సులు సిద్ధంగా ఉంచి, ఆరోగ్య శాఖ తరఫున 28 మంది వైద్యులు, 104 మంది పారా మెడికల్ సిబ్బంది షిఫ్ట్‌ల వారీగా విధుల్లో ఉన్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ నిరంతర శుభ్రతను నిర్ధారించింది. మార్షలింగ్ ఏరియా, హ్యాండ్‌బాల్ కోర్ట్, బాస్కెట్‌బాల్ కోర్ట్, ట్రాక్, కబడ్డీ హాల్, రెజ్లింగ్ హాల్ వద్ద తగినంత మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేశారు. వేదిక మొత్తం లైటింగ్ ,జనరేటర్ బ్యాకప్ సదుపాయం కల్పించబడింది. సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి ఆర్మీ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేస్తున్నారు. సైన్య సిబ్బందికి ఇండోర్ స్టేడియం, యూత్ హాస్టల్ వద్ద వసతి ఏర్పాట్లు చేయబడ్డాయి. అభ్యర్థుల కోసం తాగునీరు, టెంట్ సదుపాయాలు కల్పించారు. వేదిక ప్రధాన ద్వారం తో పాటు పరిసర ప్రాంతాల్లో పటిష్ట పోలీసు భద్రతా ఏర్పాట్లు చేశారు. ఆర్మీ జారీ చేసిన ఐడీ కార్డులు కలిగి ఉన్న వారికే ప్రవేశం అనుమతిస్తున్నారు. ప్రతి రోజూ రన్నింగ్, ఫిజికల్ ఫిట్నెస్, మెడికల్ టెస్టులు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం నిర్వహించబడతాయని ఆర్మీ అధికారులు తెలిపారు.

## స్పీకర్ పై సుప్రీంకోర్టులో కోర్టు దిక్కరణ పిటిషన్

దాఖలు చేసిన బీఆర్ఎస్

**న్యూఢిల్లీ, మహా :** శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సుప్రీం కోర్టులో ధిక్కరణ పిటిషన్ వేశారు. పార్టీ ఫిరాయించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లలపై నిర్ణయం తీసుకోనందుకు కేటిఆర్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. జూలై 3న కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం మూడు నెలల గడువులోగా పార్టీ ఫిరాయించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై యాక్షన్ తీసుకోవాలి. అయినా పార్టీ ఫిరాయించిన 10 బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని కేటీఆర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. స్పీకర్ కోర్టు తీర్పుని ధిక్కరించారని ఆయన భావించి సుప్రీంకోర్టుకు వెళ్లారు. స్పీకర్ కోర్టు ధిక్కార పిటిషన్‌పై అత్యవసరంగా విచారణ జరపాలని కేటీఆర్ కోరారు. బీఆర్ఎస్ తరపు న్యాయవాది సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్ ధర్మాసనం ఈ పిటిషన్ గురించి ప్రస్తావించారు. సుప్రీం కోర్టు సీజేఐ ఈ పిటిషన్‌పై వచ్చే సోమవారం విచారణ చేపడతామని తెలిపారు. నవంబర్ 23 న సీజేఐ గవాయ్ పదవీ విరమణ ఉంది. ఈనేపథ్యంలో ఈ కేసు అప్పటివరకు సాగదీస్తున్నారని న్యాయవాది మోహిత్ రావు తెలిపారు. నవంబర్ 24 తరువాత కూడా సుప్రీంకోర్టు ఉంటుంది కదా అని సీజేఐ చెప్పుకొచ్చారు. తెలంగాణలో పార్టీ ఫిరాయించిన పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై స్పీకర్ చర్యలు తీసుకునేలా ఆదేశాలివ్వాలంటూ గతంలో బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, పాడి కౌశిక్ రెడ్డి, వివేకానంద్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్ ప్రకారం ఎమ్మెల్యేల అనర్హతను కోరుతూ దాఖలైన పిటిషన్లను మూడు నెలల వ్యవధిలోగా నిర్ణయించాలని జులై 31న తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది.

## గ్రీవెన్స్ లో వెల్లువెత్తిన ఫిర్యాదులు

90 ఫిర్యాదులను స్వీకరించిన బల్దియా కమీషనర్

**వరంగల్ మహా;** బల్దియా గ్రీవెన్స్ (ప్రజావాణి) లో స్వీకరించిన ఫిర్యాదులను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించవద్దని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని పురస్కరించుకొని బల్దియా ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని ప్రజల నుండి వినతులను స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా స్వీకరించిన ఫిర్యాదులు విభాగాల వారిగా.. 1. టౌన్ ప్లానింగ్..41 2.ఇంజనీరింగ్....33 3.రెవేన్యూ......07 4. హెల్త్ & శానిటేషన్..05 5.నీటి సరఫరా...02 6.హార్టికల్చర్..02, మొత్తం. 90గా అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, ఎస్ ఈ సత్యనారాయణ, సిఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి, సి హెచ్ ఓ రమేష్ ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్ డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, ఎం హెచ్ ఓ డా.రాజేష్ పన్నుల అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్‌లో రైతుల నష్టం జరగనివ్వం



ఎమ్మెల్యే కోరం కనకయ్య

**ఇల్లందు, మహా:** మార్కెట్లో రైతులకు ఎటువంటి నష్టం జరగకుండాచర్యలుతీసుకుంటామని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. సోమవారం ఇల్లందు మార్కెట్ కమిటి కార్యాలయంలో ఎమ్మెల్యే మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులను రాజులుగా నిలబెట్టడం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అకాల వర్షాల కారణంగా రైతులకు నష్టం జరగకుండా ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టిందని చెప్పారు. మొక్కజొన్నకు క్వింటాకు రూ.2400, వరికి రూ.2389 మద్దతు ధరగా ప్రభుత్వం నిర్ణయించి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిందని తెలిపారు. అయితే, కొంతమంది కమ్యూనిస్టు పార్టీ నాయకులు దళారులతో కుమ్మకై క్వింటాకు రూ.1950కే కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు ఇల్లందు మార్కెట్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే తమ పంటను విక్రయించాలని సూచించారు. ఇప్పటికే కొనుగోలుదారులకు 1950 రూపాయలకు కొనుగోలు చేయవద్దని నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. ఇల్లందు, టేకులపల్లి, బయ్యారం మండలాల్లో అధికంగా మొక్కజొన్న సేద్యం చేసే రైతులకు ప్రభుత్వం పక్కగా నిలుస్తుందని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే తక్కువకు కొనుగోలు చేసే దళారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటి చైర్మన్ బానోత్ రాంబాబు, సొసైటీ చైర్మన్ మెట్ల కృష్ణ, డైరెక్టర్లు కిన్నెర నరసయ్య, రావుల రమేష్, బండారి శ్రీను, వ్యవసాయ అధికారి సతీష్, నాయకులు పూనెం సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు సత్వరం పరిష్కారించాలి..

జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**యాదాద్రి భువనగిరి, మహా:** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు సత్వరమే పరిష్కారించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం రోజు కలెక్టరేట్ సమావేశమందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ భాస్కరరావు లతో కలిసి జిల్లా కలెక్టర్ వివిధ ప్రాంతాల ప్రజల నుండి 50 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 33, జిల్లా పంచాయతీ 4,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ 2, ల్యాండ్స్ & సర్వే 2, ఇరిగేషన్ 2, మున్సిపాల్టీ 2,వైద్య శాఖ,మార్కెటింగ్,జిల్లా సంక్షేమ శాఖ,సివిల్ సప్లై, హౌసింగ్ శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. వివిధ శాఖలకు వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిశీలించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో డిఆర్ఓ జయమ్మ, జడ్పీ సీఈవో శోభారాణి, డిఆర్డిఏ పి.డి నాగిరెడ్డి, హౌసింగ్ పీడీ విజయ సింగ్,వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**భువనగిరి, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం చీమల కొండూరు , చందుపట్ల ఐ.కే.పి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆకస్మిక తనిఖీ చేశారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రైతులతో మాట్లాడుతూ .... ఎన్ని ఎకరాలు వేశారు , కొనుగోలు కేంద్రంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. రైతులు గ్రామంలోకి చెత్త ట్రాక్టర్ లు రావడం లేదని తెలుపగానే వెంటనే జిల్లా పంచాయతీ అధికారికి ఫోన్ చేసి రేపటి నుండి గ్రామాలకు ట్రాక్టర్లు పంపాలని ఆదేశించారు.చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.కొనుగోలు కేంద్రంలో ఇప్పటి వరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారని కేంద్రం నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.ఈ రోజు ఎన్ని ధాన్యం కుప్పలు కాంటా వేసి కొనుగోలు చేశారన్నారు. ధాన్యం తేమ శాతాన్ని జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. తేమ శాతం వచ్చిన వెంటనే ధాన్యం నిల్వ ఉంచకుండా కొనుగోలు చేసి లారీల ద్వారా మిల్లులకు తరలించాలన్నారు. ధాన్యం కుప్పలను టార్పాలిన్స్ కవర్లతో కప్పి ఉంచాలని సూచించారు. కొనుగోలు చేసినంత వరకు ట్యాబ్ ఎంట్రీ పూర్తి అయిందా అని అడిగి ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. కొనుగోలు కేంద్రంలో వచ్చే సీజన్ వరకు రైతులకు కావాల్సిన అన్ని వసతులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రముఖ రచయిత అందెశ్రీకి ఘనంగా నివాళులర్పించిన టియు జేఏసీ నాయకులు



**భువనగిరి, మహా :** ప్రముఖ రచయిత అందెశ్రీకి టీయుజేఏసీ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు ప్రపుల్ రాంరెడ్డి తో సహా పలువురు ఉద్యమకారులు సోమవారం అందెశ్రీ అంతిమయాత్రలో పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు తెలంగాణ ఉద్యమంలో అందే శ్రీ కీలక పాత్ర పోషించార ని మాయమైపోతున్నాడమ్మా గీతంతో మంచి పేరు తెచ్చుకున్నారని వారు అన్నారు అందే శ్రీ రాసిన జయజయహే తెలంగాణ ను రాష్ట్రప్రభుత్వం రాష్ట్ర గీతంగా గుర్తించిన విషయం తెలిసింది అలాంటి కవి తెలంగాణ ప్రజలకు దూరం కావడం తీరని లోటని వారన్నారు ఈ అంతిమయాత్రలో ఉద్యమకారులు టి యు జెఏసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రన్న ప్రసాద్ మోహన్ బైరాగి ఏ యాదగిరి ధనలక్ష్మి సుజ్జి సుచరిత సునీత లలిత పాల్గొన్నారు.



### విద్యార్థులకు నోటు బుక్స్ పంపిణీ

**ఆమనగల్లు, మహా:** ఆమనగల్లులోని ప్రభుత్వ పాఠశాలలో సోమవారం రేవంత్ మిత్రమండలి, కాంగ్రెస్ నాయకులు విద్యార్థులకు నోటు బుక్స్, పెన్నులను పంపిణీ చేశారు.సీఎం జన్మదినాన్ని పురస్కరించుకుని కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేటుకు దీటుగా విద్యను అందిస్తూ నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వం అందిస్తోందన్నారు.విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



### ఆడపడుచు పెళ్లికి మాజీ వైస్ ఛైర్మన్ సహాయం

**ఆమనగల్లు, మహా:** తలకొండపల్లి మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన పేదింటి ఆడపడుచు హారిక వివాహానికి సోమవారంరాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ ఛైర్మన్, మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ రూ.25 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆడపడుచు పెళ్లికి ఇబ్బందులు పడుతున్నామని ఆమె తల్లిదండ్రులు యశోద శ్రీనివాసులు చేసిన వినతికి స్పందించిన ఆయన సహాయం అందించినట్లు వివరించారు. పవన్ కుమార్ రెడ్డి, వీరేశ్, బుచ్చిబాబు పాల్గొన్నారు



### రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

**ఆమనగల్లు, మహా:** మాడుగుల మండలం ఇర్విన్ పాఠశాల విద్యార్థులురాష్ట్ర స్థాయి క్విజ్, వక్తృత్వ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం లండం పర్వతాలు చెప్పారు. సోమవారం టీ షాట్,టీజీహెచ్ఎంఏ వారిఆధ్వర్యంలో జిల్లెల్లగూడ పాఠశాలలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు నచికేత్ రెడ్డి, శివ, శివకుమార్ క్విజ్, శివకుమార్ వక్తృత్వ పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు వివరించారు.



### నూతన ఎంపీఓగా బాధ్యతలు స్వీకరించిన సైదా అర్జుమన్ భాను

**వలిగొండ, మహా :** వలిగొండ మండల కార్యాలయంలో సోమవారం నూతన ఎంపీఓ గా బాధ్యతలు స్వీకరించిన సైదా అర్జుమాను భానును కార్యాలయంలో ఎంపీడీవో జలంధర్ రెడ్డి తో సూపరిండెంట్ పంచాయతీ కార్యదర్శులు అధికారులు సన్మానం చేశారు ఈ సందర్భంగా సైదా అర్జుమాను భాను మాట్లాడుతూ మండల ఎంపీడీవో జలంధర్ రెడ్డి పంచాయతీ కార్యదర్శులు సహకారంతో గ్రామాల అభివృద్ధి కృషి చేస్తానని అన్నారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వీసం నరేందర్ పబ్బు నవనీత షేక్ హుస్సేన్ చంద్రమౌళి సురేష్ కవిత అండాలు జ్యోతిలక్ష్మి నిరంజన్ పాల్గొన్నారు.



### అందెశ్రీ ఆత్మకు శాంతి చేకూరాలి

**యాదాద్రి భువనగిరి, మహా:** జయ జయహే తెలంగాణ గేయ రచయిత అందెశ్రీ మరణం పట్ల ఆయన ఆత్మకు శాంతి కలగాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ ఆవరణలో సోమవారం మౌనం పాటించి నివాళులు అర్పించారుఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హనుమంత రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, డి.ఆర్. ఓ జయమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, మహా :** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి చంద్రయ్య, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు లతో కలిసి ప్రజావాణి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మందమర్రి మండలం సారంగపల్లి గ్రామానికి చెందిన బచ్చలి ప్రవీణ్ కుమార్ మండలంలోని తుర్కపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో మినీ అంగన్వాడి కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి పట్టణంలోని రడగంబాల బస్తీకి చెందిన ఇల్లందుల రాజమణి తనకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు మహేష్ వర్మ తన దరఖాస్తులో అడ్డా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. చెన్నూర్ మండలం ఆస్నాద్ గ్రామానికి చెందిన రామిళ్ళ ప్రమీల తనకు 2013లో ప్రభుత్వం భూమిని పట్టా ఇచ్చిందని, ఇట్టి పట్టాను డిజిటలైజ్ చేసి నూతన పట్టా పాస్ పుస్తకం మంజూరు చేసి తనకు భూమిని చూపించి ఆదుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. లక్షెట్టిపేట మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన గవ్వల శంకరయ్య మండలంలోని రెబ్బెనపల్లి గ్రామ శివారులో తన తల్లి నుండి వారసత్వంగా వస్తున్న భూమికి పట్టా మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణంలోని అశోక్ రోడ్ ప్రాంతానికి చెందిన బెజ్జంకి రమ తన భర్త కంచరీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించే వారిని, తనకు పక్షవాతం రావడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని, భర్తకు పింఛన్ ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. హాజీపూర్ మండలం గుడిపేట గ్రామానికి చెందిన ఆసరి రాజలక్ష్మి నిరుపేద అయిన తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కాసర్ల శ్రీనివాస్, మంచు శంకర్ లు తమ దరఖాస్తులో తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులకు దివ్యాంగ పింఛన్ ఇప్పించాలని, ప్రతి నెల సదరం శిబిరాలు నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషిచేసి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇంటిలో పచ్చగా పది కాలాలపాటు చల్లగా జీవించండి

**పేదల కళ్ళలో ఆనందం నింపడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం.. షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**షాద్ నగర్, మహా:** పేదల కళ్ళలో సొంత ఇంటి కల నెరవేరిన ఆనందాన్ని చూస్తుంటే ఎంతో ముచ్చట వేస్తుందని ఇది ప్రజా ప్రభుత్వ విజయంగా భావిస్తున్నామని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్ నగర్ మున్సిపాలిటీ 4వ వార్డులోని రాంనగర్ కాలనీలో స్థానిక కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొంకల్ల చెన్నయ్య ఆధ్వర్యంలో జరిగిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితర స్థానిక నాయకులు ఆయన వెంట హాజరయ్యారు. డి.రమణ దేవి దంపతులు నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశ కార్యక్రమంలో పట్టణ నాయకులతో కలిసి హాజరైన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ రిబ్బన్ కట్ చేసి లాంచనప్రాయంగా ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు బట్టలు సంప్రదాయపద్ధంగా పెట్టారు. స్వీట్ తినిపించి, శాలువాతో సన్మానించి, కుటుంబ సభ్యులతో ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. షాద్ నగర్ నియోజకవర్గంలోని షాద్ నగర్. మున్సిపాలిటీ 4వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ళను ప్రారంభోత్సవం చేయడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. పేదల కళ్ళలో ఆనందం నింపడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని, ఇందిరమ్మ ఇండ్లు లేని గ్రామాలు లేవని అన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ప్రతి గ్రామంలో మౌలిక వసతులను కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ఈ గృహప్రవేశం సందర్భంగా ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్నబియ్యంతో చేసిన పులిహోరను ఎమ్మెల్యే ఆరగించారు. పచ్చగా పది కాలాలపాటు చల్లగా ఉండాలని దీవించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, పట్టణ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య, నాయకులు అగ్గనూర్ బస్వం, చెంది తిరుపతి రెడ్డి, కొందుర్గ్ మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్లు, రాజేందర్ రెడ్డి, శ్రీనివాస్,రవి కుమార్ ముదిరాజ్, శ్రీను నాయక్, బలరాజ్ గౌడ్,మాధవులు యాదవ్, మురళీమోహన్ (అప్పి), శేఖర్ గౌడ్,రమేష్, సందీప్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మహబూబ్, మహేందర్, దిలీప్, సందీప్ గౌడ్, సున్నం రాజు, ముబారక్ అలీ ఖాన్, షఫీయోద్దిన్, గోదా మాధవులు తదితరులు పాల్గొన్నారు.



## 10వ తరగతి పరీక్ష ఫీజు పేరిట 2 వేల రూపాయలు వసూళ్ళు...!?

- ప్రైవేట్ విద్యాసంస్థల నిర్వాకం... ప్రేక్షక పాత్రలో విద్యార్థి సంఘాలు
- నిద్రావస్తలో మంచిర్యాల విద్యాశాఖ అధికారులు

**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లాలో 10 వ తరగతి పరీక్ష ఫీజు పేరిట ప్రైవేట్ విద్యాసంస్థలు 1500 నుండి 2 వేల రూపాయలు వసూళ్ళు..!? కు పాల్పడుతున్నారని విద్యార్థినీ, విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మంచిర్యాల జిల్లాలోని వివిధ మండలంలో విద్య బోధన చేస్తున్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు 2026 సంవత్సరానికి గాను పదవ తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థుల తల్లిదండ్రుల నుండి ఎవరికి తోచినట్టుగా వారు పరీక్ష ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. జిల్లాలో నిర్వహిస్తున్న, ఒక్కొక్క పాఠశాలలో ఒక్కొక్క రకంగా.. ఫీజులో తేడా.. కనబడుతుంటే.. విద్యార్థుల తల్లిదండ్రులు అయోమయానికి గురవుతున్నారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పవలసిన ప్రైవేట్ విద్యాలయాలు అక్రమ మార్గంలో అధిక ఫీజులు వసూలు చేస్తుంటే ఏం చేయాలో తోచక బిక్క మొఖం వేస్తున్నట్లు వెల్లడవుతుంది. నిజంగా చెప్పాలంటే పదవ తరగతి చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒక్కరికి 600 రూపాయలు ఫీజు వసూలు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల నేపథ్యంలో కొన్ని ప్రైవేటు పాఠశాలలు ఒక్కొక్క విద్యార్థి నుండి 1500 నుండి 2000 రూపాయల వరకు పరీక్ష ఫీజును విద్యార్థుల తల్లిదండ్రుల నుండి ముక్కు పిండి వసూలు చేస్తున్నారంటూ.. విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అధిక మొత్తంలో ప్రైవేట్ విద్యాసంస్థలు ఫీజులు వసూలు చేస్తుంటే.. విద్యా కమిటీలు ,పేరెంట్ కమిటీలు, ప్రైవేటు విద్యాసంస్థలను అదుపు చేసే ట్రస్మా ఏం చేస్తుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు ఈ విషయంపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

# త్వరితగతిన పరిష్కరించాలి-కలెక్టర్



**ఆదిలాబాద్ మహా :** ప్రజావాణిలో వచ్చిన అర్జీలను వేగంగా, పారదర్శకంగా పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజార్షి షా అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ స్వయంగా పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రతి అర్జీని సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో నిర్ధారించి, పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, ఉపాధి, భూభారతి సహా వివిధ విభాగాలకు చెందిన మొత్తం 108 దరఖాస్తులు అందాయని, వాటిని శాఖల వారీగా త్వరితగతిన పరిశీలించి పురోగతి వివరాలు దరఖాస్తుదారులకు తెలియజేయాలని సూచించారు.అనంతరం తెలంగాణ రాష్ట్ర గీతం రచయిత, కవి అందే శ్రీ మరణవార్తపై కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారులు రెండు నిమిషాల మౌనం పాటించి సంతాపం తెలిపారు.ఈప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో స్రవంతి, డిప్యూటీ కలెక్టర్ వంశీ కృష్ణతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ రాష్ట్ర కార్యదర్శిగా బండారి సతీష్



**ఆదిలాబాద్ మహా:** తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ రాష్ట్ర కార్యదర్శిగా ఆదిలాబాద్ మాజీ కౌన్సిలర్, ఫ్లోర్ లీడర్ , మున్సిపల్ కౌన్సిల్ ఫోరం జిల్లా అధ్యక్షులు బండారి సతీష్ అలాగే జిల్లా ప్రధాన కార్యదర్శి గా యాల్ల పోతారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కార్యవర్గం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ఉద్యమకారుల ఆత్మ గౌరవం, సంక్షేమం కోసం కృషి చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు డా.చీమ శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాకాల రామచందర్ ఆదేశించారు. తమపై విశ్వాసంతో బాధ్యతలు అప్పచెప్పిన రాష్ట్ర కార్యవర్గానికి వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తమకిచ్చిన అవకాశాన్ని సద్వినియోగ పరుచుకొని ఉద్యమకారుల ఆత్మగౌరవం , సంక్షేమం కోసం తమ శాయశక్తులా కృషి చేస్తామని తెలిపారు.

# పీడీఎస్ బియ్యం స్వాధీనం




**సిర్పూర్, మహా :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం గూడెం గ్రామ సమీపంలో టాస్క్ ఫోర్స్ పోలీసులు పీడీఎస్ బియ్యం పట్టుకున్నారు. మూడు బైక్ లపై అక్రమ రవాణా చేస్తున్న 4 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం, మూడు ఎక్సెల్ బైక్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. జునుగారి సంజీవ్ , చెండే మహేష్ , కొట్రంగి రామయ్య లను స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్, ఐపీఎస్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల కింద లబ్ధిదారుల కోసం ఉద్దేశించిన పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.. ఇటువంటి చర్యలకు పాల్పడినవారెవరికీ మన్నింపు ఉండదని హెచ్చరించారు.ఈ ఆపరేషన్‌లో టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ రాణా ప్రతాప్, ఎస్ఐ రాజు కంధూరి, హెడ్ కానిస్టేబుల్ మహ్మూద్, కానిస్టేబుళ్లు విజయ్, రమేష్, హోంగార్డు శేఖర్ పాల్గొన్నారు.

## కాగజ్‌నగర్‌లో ధృవీకరణ పత్రాల జారీ ఆలస్యంతో ప్రజల్లో ఆగ్రహం




**మహా:** కాగజ్‌నగర్ మండలంలో కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యుల వంటి ధృవీకరణ పత్రాలు 2020 నుండి ఇప్పటివరకు జారీ కాకుండా పెండింగ్‌లో ఉండటంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసిన అనేక పత్రాలు ఇంకా ప్రాసెస్‌లో లేకపోవడం వల్ల ప్రజలు నిస్సహాయ పరిస్థితిలో ఉన్నారని స్థానికులు చెబుతున్నారు.దరఖాస్తుల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఎవరు లంచం ఇస్తే వారివే ముందుగా చేయబడుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు సమీక్షలు నిర్వహించకపోవడం వల్ల ఈ సమస్య మరింత తీవ్రతరం అవుతోందని తెలిపారు.ఈ నేపథ్యంలో సబ్‌కలెక్టర్ కోరుతూ ముంజం ఆనంద్ కుమార్, వసాకే సాయి, కూచిపూడి ఏసు కుమార్, తిమోతి తదితరులు ప్రత్యేక కార్యక్రమం చేపట్టి పెండింగ్‌లో ఉన్న అన్ని ధృవీకరణ పత్రాలను తక్షణమే జారీ చేయాలని విన్నవించారు.

# పెద్దపులి సంచారం-భయాందోళనల్లో ప్రజలు



**సిర్పూర్ మహా :** సిర్పూర్ (టీ) మండలం ఇటిక్యాల పహాడ్ పరిసరాల్లో పెద్దపులి కనిపించడంతో గ్రామస్తులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఇటీవల కొద్ది రోజులుగా ఈ ప్రాంతంలో పులి కదలికలు కొనసాగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. దీంతో ప్రజల్లో భయం నెలకొంది.ఈ ఘటనపై సిర్పూర్ టీ ఫారెస్ట్ రేంజ్ అధికారి ప్రవీణ్ కుమార్ సూచనల మేరకు, మాకిడి ఫారెస్ట్ సెక్షన్ అధికారి వల్క మోహన్‌రావు సిబ్బందితో కలిసి పర్యటించారు. పులి సంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, రాత్రివేళ బయటకు వెళ్లకుండా ఉండాలని సూచించారు. పులి కదలికలను గుర్తించేందుకు అటవీ శాఖ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనుంది.అధికారులు ప్రజలను అప్రమత్తంగా ఉండాలని, పులి కనిపించిన వెంటనే అటవీశాఖకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

## ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నవంబర్ 17న చలో ఢిల్లీ

**దళితుల ఆత్మగౌరవ ప్రదర్శన విజయవంతం చేద్దాం**

**గండిపేట,మహా:** ఈ నెల 17 న ఎమ్మార్పీఎస్ మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఢిల్లీలో తలపెట్టబోతున్న చలో ఢిల్లీ దళితుల ఆత్మ గౌరవ సభను విజయవంతం చెయ్యాలని గండిపేట మండల ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్లగారి గణేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఆత్మ గౌరవాన్ని కాపాడుకునేందుకు ఆయన నాయకత్వంలో ఢిల్లీలో జరగబోతున్న దళితుల ఆత్మగౌరవ ప్రదర్శనకి పెద్ద ఎత్తున తరలివెళ్లాలని అందుకోసం జిల్లా సీనియర్ నాయకులు, మండల సీనియర్ నాయకులు, అన్ని గ్రామాల అధ్యక్షులు మరియు కార్యకర్తలందరూ పెద్ద ఎత్తున ఢిల్లీ కి బయలుదేరి దళితులపై జరుగుతున్న అన్యాయాలను ఎండగడుతూ దళితుల కష్టాలను ప్రభుత్వాలకు తెలియచేస్తూ పెద్ద ఎత్తున ఆత్మగౌరవ ప్రదర్శన కు సిద్ధం కావాలని ఈ సందర్భంగా తెలిపారు.

# సాహితీ వీరుడా అందుకో వందనం

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**షాద్ నగర్, మహా:** జయ జయహే తెలంగాణ అంటూ అక్షరాలు రాసిన ఆ చేయి ఇప్పుడు లేదని తలుచుకుంటేనే ఎంతో బాధగా ఉంది.. తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి తన వంతు సహకారం అందించి నేటి వరకు సాహిత్య లోకానికి అక్షర రూపంలో అండగా నిలబడిన సరస్వతీ పుత్రుడు మరో నవ కాళిదాసు ప్రముఖ కవి, గాయకుడు అందెశ్రీ మరణం తెలంగాణ రాష్ట్రానికి, సాహిత్య లోకానికి తీరనిలోటని షాద్ నగర్ ఎమ్మెల్యే, వీర్లపల్లి శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ మరణంపై ఎమ్మెల్యే శంకర్ సోమవారం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. షాద్ నగర్ ఎమ్మెల్యే ప్రభుత్వ క్యాంపు కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తదితర నాయకులు అందెశ్రీ చిత్రపటానికి నివాళులు అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన సాంస్కృతిక ఉద్యమంలో, కవిగా తన పాటలతో, సాహిత్యంతో, కీలక పాత్ర పోషించిన అందెశ్రీ మరణం తెలంగాణకు తీరనిలోటని అన్నారు. ఉద్యమ కాలంలో అందెశ్రీతో ఎంతోమంది కవులు కళాకారులు రాజకీయ నాయకులకు అదే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తదితర ప్రభుత్వానీతో ఉన్న అనుబంధాన్ని ఎమ్మెల్యే శంకర్ ఈ సందర్భంగా స్మరించుకున్నారు. అందెశ్రీ మరణంతో శోకతప్త హృదయులైన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అందెశ్రీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఎమ్మెల్యే శంకర్ ప్రార్థించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత అందెశ్రీకి తగిన గుర్తింపు గత ప్రభుత్వం ఇవ్వలేదని విచారణ వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అయ్యాక ఆయనను ఎంతో ఘనంగా సత్కరించి అన్ని విధాల ఆదుకున్నారని గుర్తు చేశారు. అధ్యక్షుడి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. శ్రద్ధాంజలి ఘటించిన వారిలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజ్ గౌడ్, సీనియర్ నాయకులు చెంది తిరుపతిరెడ్డి, అగ్గనూరు బస్వం, ముబారక్ అలీ ఖాన్, చంద్రశేఖర్, గోదా మాధవులు, ముబారక్ అలీఖాన్, శ్రీను నాయక్, సయ్యద్ ఖదీర్, దిలీప్, చిన్న, మురళీమోహన్ అప్పి, జంగారి రవి తదితరులు పాల్గొన్నారు.



## స్వామి వారి ఆశీర్వచనాలు అందరిపై ఉండాలి

**ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

**రాజేంద్రనగర్ మహా ;** మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని లక్ష్మీగూడా హౌసింగ్ బోర్డ్ కాలనీ లో శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవస్థానం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా నాగదేవత అభయాంజనేయస్వామి, నవగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అభయాంజనేయ స్వామి ఆశీర్వచనాలు ప్రజలందరిపై ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షులు అడికే మారప్ప, దేవాలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలకు సత్వర పరిష్కారం

**అధికారుల ఆదేశించిన జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** జిల్లా ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు మరింత శ్రద్ధ కనబరచాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 29 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ.. జిల్లాలోని సంక్షేమ హాస్టల్ నందు, గురుకులాలలో విద్యార్థులకు ఎలాంటి సమస్యలు రాకుండా, ఇబ్బందులు కలగకుండా చూడాలని, విద్యార్థులకు అందించే ఆహారంలో ఎక్కడ రాజీపడకుండా నాణ్యమైన ఆహారం అందించాలని తెలిపారు. జిల్లాలో బాల్య వివాహాలు జరగకుండా ప్రజలకు అవగాహన కల్పించి బాల్య వివాహాలను అరికట్టాలని, సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. పత్తి కొనుగోలు, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, ఎక్కడ కూడా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభం చేయకుండా ఉండకూడదని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్నీ సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. బాల్య వివాహాలను ఆపండి అనే పోస్టర్ ను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మత్స్య కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

**మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు, నరసింహ**

**రాజేంద్రనగర్ మహా :** శంషాబాద్ మండలంలోని మదనపల్లి గ్రామంలో మత్స్య కార్మిక సంఘం మండల సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు నరసింహమాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా లోని మొయినాబాద్ అజీజ్ నగర్ లో మార్కెట్ యార్డ్ ప్రభుత్వం నిర్మిస్తుంది కానీ అదే మార్కెట్‌లో రిటైల్ హోల్సేల్ చేపల మార్కెట్ కు 20 ఎకరాల భూమిని కేటాయించాలి. జిల్లాలోని మత్స్యకారులకు ఉపయోగకరంగా ఉండేటటువంటి మార్కెట్ను ప్రభుత్వం నిర్మించాలి. రంగారెడ్డి జిల్లాలో చెరువులు కుంటలు కబ్జాలకు తావు లేకుండా చూసే బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. చెరువులో కుంటలో మురుగు నీరును చేరకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రంగారెడ్డి జిల్లాలో ప్రతి సొసైటీకి పది లక్షల రూపాయలు అందజేయాలి. చెరువుల కుంటలకు ఎఫ్ టి ఎల్ హద్దుల బోర్డులు ఏర్పాటు చేయాలి. 50 సంవత్సరాలకు పైబడిన ప్రతి మత్స్య కార్మిక సభ్యునికి వృద్ధాప్య పింఛను అందించా లన్నారు. రంగారెడ్డి జిల్లాలోని సీడ్ కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మత్స్య కార్మికసంఘం జిల్లా మహాసభ ఈ నెల 18న కర్తాల్ జరగనుంది. జిల్లా మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు యాటకారీ సిద్దేశ్వర్,రాజేష్ ఖన్నా, నీరటి మల్లేష్ ప్రధాన కార్యదర్శి, జిల్లా ఆనంద్ ఉపాధ్యక్షులు, నీరటి మహేష్, జిల్లా మల్లేష్, ఆంజనేయులు,మనోజ్, రాజేందర్, శ్రీను, రమేష్, నరసింహ, సురేష్, అరవింద్, శేఖర్, సత్తయ్య, ఆంజనేయులు, శీను, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లి ఎమ్మెల్యేను బద్నాం చేయడం ఇకనైనా విరమించుకోవాలి

**బెల్లంపల్లి పట్టణ సీనియర్ కాంగ్రెస్ నాయకుల వెల్లడి**



**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పేరు ప్రతిష్టలను బధ్నాం చేయడానికి కొంతమంది కాంగ్రెస్ ముసుగులోని స్వార్థపూరిత నాయకులు చేస్తున్న పనులే సాక్ష్యంగా నిలుస్తు న్నాయని కానీ బెల్లంపల్లి ఎమ్మెల్యేకు సంబంధిత వ్యవహారాలపై ఎలాంటి సంబంధం లేదని బెల్లంపల్లి పట్టణకాం గ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కాంగ్రెస్ నాయకులు వెల్లడించారు.సోమవారం రోజు బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాజీ మున్సిపల్ చైర్పర్సన్ మత్తమారి సూరిబాబు నాయకత్వంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ బెల్లంపల్లిఎమ్మెల్యే గడ్డంవినోద్ను బదనాం చేస్తూ కొంతమంది దళారీలు వారి పబ్బం గడుపుకుంటున్నారనీ జరుగుతున్న అవినీతి పై ఎమ్మెల్యేకు ఎలాంటి సంబంధంలేదని సమావేశంలో స్పష్టంచేశారు.బెల్లంపల్లి మున్సిపాలిటీ లోనే కాకుండా వివిధ మండలాల్లో కూడా ఇందిరమ్మ ఇల్లల్లో అవినీతి చోటు చేసుకోవడం చాలా బాధాకరమని సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు.బెల్లంపల్లి మున్సిపాలి టీలో ఉన్న 34 వార్డులల్లో ఇందిరమ్మ ఇండ్ల ప్రోసిడింగ్ ఇవ్వడంలో అవినీతి జరిగిందనీ,అన్ని వార్డులకు సమానంగా ఇవ్వలేదని కొన్ని వార్డులకు మొత్తానికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వలేదు, దీనికి ప్రధాన కారణం పెద్దఎత్తున అవినీతి జరిగింద ని నాయకులు దీనిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పూర్తిగా పేదవాళ్లకు చెందాలి కానీ దీని మీద కూడా పలు ఆరోపణలురావడం బాధాకరం అని కాంగ్రెస్ పార్టీకిచెందిననాయకులు 3 లక్షలు రూపాయలు ఇస్తేనే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అలాట్మెంట్ చేపిస్తామని చెప్పడం, జిల్లా అధ్యక్ష పదవి కూడా డబ్బులు ఇస్తేనే వస్తుందని మాట్లాడడం వల్ల ప్రజల్లో పార్టీ బదనామవుతోంది పార్టీ పేరు చెప్పుకునిపబ్బం గడుపుకుంటున్న వ్యక్తులపై అధిష్టానం వెంటనే చర్యలుతీసుకోవాలని డిమాండ్ చేశారు.బెల్లంపల్లి పట్టణంలో రోడ్డు వెడల్పు చేయాలని నిర్ణయించడం అభివృద్ధిలో భాగమని కానీ ముందస్తుగా చిరువ్యాపారస్తులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో భాగంగా స్థలాలు కేటాయిస్తే బాగుండేదని కానీ అలాంటి చర్యలు ఏమి చేయకుండా చిరు వ్యాపారస్తులను రోడ్డున పడేయడంతో వారికుటుంబాలు ఉపాధికోల్పోయి తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే వినోద్ జోక్యం చేసుకోని చిరువ్యాపారస్తులకు న్యాయం చేయాలని వెల్లడించారు. సంబంధిత విషయాలపై వాస్తవాలను తెలుసుకొని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు కార్యకర్తలకు పేద ప్రజలకు న్యాయం చేయాలని 10 రోజుల్లో ఎమ్మెల్యే స్పందించని యెడల పేద ప్రజల పక్షాన బెల్లంపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమం చేస్తామని సమా వేశంలో నిర్ణయించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శులు గెల్లీ జయరాంయాదవ్, సిలువేరి సత్యనారాయణ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మమ్మద్ అఫ్జల్, ఎస్సీ సెల్ జిల్లానాయకులు మేకల శ్రీనివాస్,పోతరాజుల శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మత్త మరి శ్రీనివాస్,మైనార్టీ నాయకుడు అన్వర్ ఖాన్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మంతెన మల్లేష్,మంతెన కొమురయ్య ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు, బర్రె మధురయ్య ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు, మహమ్మద్ ఓజీయార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మహమ్మద్ రషీద్, ఆరేపల్లి రాజయ్య,రవి, బషీర్, మత్తమరి రాయ మల్లు,ఆడెపు మహేష్ టౌన్ కార్యదర్శి, బైరి శ్రీనివాస్,పీక లక్ష్మణ్, పోషన్న, జంజిరాల మనోహర్,గంధం రమేష్, బాబురావు,బబ్లు హాజరయ్యారు.

# ఈ పోస్టాఫీసు స్కీములో పెట్టిన డబ్బులు డబుల్




పోస్టాఫీసు పొదుపు పథకాలకు ప్రజల్లో ఎప్పుడూ ఆదరణ ఉంటుంది. పోస్టాఫీసుల ద్వారా ఆకర్షణీయమైన వడ్డీతోపాటు రిస్క్ లేకుండా రాబడిని ఇచ్చే స్కీములు ఎన్నో ఉన్నాయి. అలాంటి వాటిలో ఒకటే 'కిసాన్ వికాస్ పత్ర' (KVP). భారత ప్రభుత్వం మద్దతుతో ఇండియా పోస్ట్ అందించే అత్యంత నమ్మదగిన, సురక్షితమైన పెట్టుబడి పథకాలలో ఒకటిగా 2025లో కూడా కొనసాగుతోంది. కచ్చితమైన రాబడితో తక్కువ రిస్క్ పెట్టుబడులను కోరుకునేవారి కోసం రూపొందించిన ఈ పథకం.. దీర్ఘకాలికంగా స్థిరంగా రాబడిని పెంచుకునే మార్గాన్ని అందిస్తోంది.

### కచ్చితమైన రాబడి.. అసలుకు భద్రత

కిసాన్ వికాస్ పత్ర పథకం పెట్టుబడి పెట్టిన మొత్తానికి ప్రభుత్వ హామీతో కూడిన భద్రతను అందిస్తుంది. మార్కెట్ హెచ్చుతగ్గులతో సంబంధం లేకుండా, నిర్దిష్ట కాలవ్యవధిలో పెట్టుబడి రెట్టింపు అవుతుంది.

### తక్కువ మొత్తంతోనే పెట్టుబడి

కిసాన్ వికాస్ పత్ర పథకంలో తక్కువ మొత్తం పెట్టుబడితోనే ప్రవేశించవచ్చు. కేవలం రూ.1,000తో పొదుపు ప్రారంభించవచ్చు. గరిష్టంగా ఎంతైనా పెట్టుబడి పెట్టవచ్చు. ఎలాంటి పరిమితి లేదు. ఇది చిన్న, మధ్యతరహా, పెద్ద మొత్తంలో పొదుపు చేసేవారికి కూడా అందుబాటులో ఉంటుంది.

### ఆకర్షణీయమైన వడ్డీ రేటు

కిసాన్ వికాస్ పత్ర పథకంపై ప్రస్తుతం 7.5% చక్రవడ్డీ రేటు అందుబాటులో ఉంది. దీని ద్వారా పెట్టుబడి పెట్టిన మొత్తం సుమారు 115 నెలల్లో (9 సంవత్సరాలు 7 నెలలు) రెట్టింపు అవుతుంది. వడ్డీ రేటును ప్రభుత్వం కాలానుగుణంగా సవరిస్తుంది.

### కేవీపీలో ఎవరు పెట్టుబడి పెట్టవచ్చు?

కిసాన్ వికాస్ పత్రలో సాధారణ వ్యక్తులెవరైనా తమ పేరుతో పెట్టుబడి పెట్టవచ్చు. అలాగే ఇద్దరు, ముగ్గురు కలిసి కూడా జాయింట్ ఖాతాదారులుగా పొదుపు చేయవచ్చు. ఇక మైనర్లు అయితే తల్లిదండ్రులు లేదా సంరక్షకుల ద్వారా ఈ స్కీములో చేరవచ్చు. ఖాతా తెరవడానికి పోస్టాఫీసు లేదా ఏదైనా ప్రభుత్వ రంగ బ్యాంకు శాఖను సందర్శిస్తే సరిపోతుంది. గుర్తింపు, చిరునామా రుజువు వంటి ప్రాథమిక డాక్యుమెంట్లు అవసరమవుతాయి.

### కేవీపీ పథకం ప్రధాన ఫీచర్లు, ప్రయోజనాలు

**పెట్టుబడి రెట్టింపు:**

మార్కెట్ రిస్క్ లేకుండా నిర్దిష్ట కాలంలో మీ డబ్బు రెట్టింపు అవుతుంది

**ముందస్తు ఉపసంహరణ సౌకర్యం:**

2.5 సంవత్సరాల తరువాత అత్యవసర పరిస్థితులలో మీ పెట్టుబడి సొమ్మును ఉపసంహరించుకోవచ్చు.

**రుణం, బదిలీ సదుపాయం:**

కేవీపీ సర్టిఫికెట్లను బ్యాంకుల వద్ద పూచీకత్తుగా ఉంచి రుణం పొందవచ్చు. పెట్టుబడిని వ్యక్తుల మధ్య లేదా పోస్టాఫీసుల మధ్య బదిలీ చేయవచ్చు. మార్కెట్ రిస్క్ లేకుండా స్థిరమైన వృద్ధి: స్టాక్ మార్కెట్ లేదా ఇతర అస్థిర పెట్టుబడి సాధనాలతో సంబంధం లేకుండా, పూర్తిగా రిస్క్ రహితమైన పెట్టుబడి మార్గం.

**2025లో కిసాన్ వికాస్ పత్ర ఎందుకంటే..**


మార్కెట్ అస్థిరత, ఫిక్స్డ్ డిపాజిట్లపై తక్కువ వడ్డీ రేట్లు ఉన్న పరిస్థితుల్లో కిసాన్ వికాస్ పత్ర స్థిరమైన వృద్ధిని కోరుకునే మదుపరులకు సురక్షితమైన ఆశ్రయం అందిస్తుంది. ఇది కొంత మందికి ప్రత్యేకంగా సరిపోతుంది. ముఖ్యంగా స్థిరమైన ఆదాయాన్ని కోరుకునే సీనియర్ సిటిజన్లు, పదవీ విరమణ చేసిన వారు, ప్రభుత్వ హామీతో కూడిన పొదుపును ఇష్టపడే గ్రామీణ మదుపరులు, చదువు, వివాహం లేదా పదవీ విరమణ కోసం దీర్ఘకాలిక ఆర్థిక ప్రణాళికలు చేసుకునే కుటుంబాలకు కిసాన్ వికాస్ పత్ర సరైన ఎంపికగా నిలుస్తుంది.

# వెండి ధర అక్కడికి!.. కియోసాకి ట్వీట్





మార్కెట్లో కేవలం బంగారం ధరలు మాత్రమే కాకుండా వెండి ధరలు కూడా అమాంతం పెరుగుతూనే ఉన్నాయి. అక్టోబర్ నెలలో రూ. 2 లక్షలు దాటేసిన వెండి రేటు.. గత కొన్ని రోజులుగా తగ్గుతూ.. ఈ రోజు (నవంబర్ 10) ఒకేసారి 4000 రూపాయలు పెరిగింది. దీంతో కేజీ వెండి రేటు రూ. 1.69 లక్షలకు చేరింది. ఈ తరుణంలో రిచ్ డాడ్ పూర్ డాడ్ పుస్తక రచయిత 'రాబర్ట్ కియోసాకి' తన ఎక్స్ ఖాతాలో ఒక ట్వీట్ చేశారు. రాబర్ట్ కియోసాకి వెండి ధరలు పెరుగుతాయనే.. నేపథ్యంలో ట్వీట్ చేశారు. సిల్వర్ 50 డాలర్లు దాటేసింది. నెక్స్ట్ స్టాప్ 70 డాలర్లు అని వెల్లడించారు. ఈ ట్వీట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. పలువురు నెటిజన్లు.. కియోసాకి చేసిన వ్యాఖ్యలతో ఏకీభవించారు. భారతదేశంలో మాత్రమే కాకుండా.. ప్రపంచ మార్కెట్లో వెండి ధరలు గణనీయంగా పెరుగుతున్నాయి. దీనికి కారణాలు చాలానే ఉన్నాయి. ప్రధానంగా.. వెండిని కేవలం ఆభరణాలు, అలంకార సామాగ్రిగా మాత్రమే కాకుండా.. ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక శక్తి, టెలికాం, వైద్య సాంకేతికత, బయోఫార్మా వంటి పరిశ్రమలలో విరివిగా ఉపయోగిస్తున్నారు. సౌర ఫలకాలు, బ్యాటరీలు, ఎలక్ట్రానిక్ భాగాలలో కూడా సిల్వర్ ఇప్పుడు కీలకంగా మారింది. వెండిని పారిశ్రామిక రంగాల్లో కూడా వినియోగిస్తున్న కారణంగా.. సిల్వర్ డిమాండ్ అమాంతం పెరుగుతుంది. దీనివల్ల ధరలు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి. గత ఏడాది లక్ష రూపాయల కంటే తక్కువ ధర ఉన్న వెండి.. నేడు రూ. 1.69 లక్షలకు చేరిందంటే.. దీనికి ఎంత డిమాండ్ ఉందో స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు.

## జియోటస్ అకాడమీ: క్రిప్టో గురించి తెలుగులో..




13 లక్షల కస్టమర్లతో.. భారతదేశంలో మూడవ అతిపెద్ద క్రిప్టో ఎక్స్ఛేంజ్ అయిన జియోటస్, దేశంలో తమ మొదటి స్థానిక భాషా క్రిప్టో ఫ్యూచర్స్ ఎడ్యుకేషన్ ప్లాట్‌ఫామ్ ప్రారంభించింది. దీనిపేరు జియోటస్ అకాడమీ. క్రిప్టో గురించి అందరినీ ఎడ్యుకేట్ చేయడమే ఈ అకాడమీ ముఖ్య ఉద్దేశం. జియోటస్ అకాడమీలో కేవలం ఇంగ్లీష్ మాత్రమే కాకుండా.. తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో లైవ్ సెషన్స్ ఉంటాయి. స్థానిక భాషల్లో లైవ్ సెషన్స్ కండక్ట్ చేయడం వల్ల.. క్రిప్టోకు సంబంధించిన ప్రతి విషయం సులభంగా అందరికీ అర్థమవుతుంది. దీనిని అగ్రశ్రేణి ట్రేడర్లు, విశ్లేషకులు కలిసి డిజైన్ చేశారు. కాబట్టి ఇందులో పాల్గొనేవారు ప్రతి దశను అర్థం చేసుకోవడానికి యాక్షన్ బేస్డ్ అభ్యాసంతో రియల్ టైమ్ ట్రేడింగ్ అనుభవాన్ని పొందవచ్చు. జియోటస్ అకాడమీ ద్వారా.. రిజిస్ట్రేషన్స్, కేవైసీ, అడ్వాన్స్డ్ ట్రేడింగ్, రిస్క్ మేనేజ్‌మెంట్ వంటి విషయాలను నేర్చుకోవచ్చు. అంతే కాకుండా విశ్లేషణ, ఎంట్రీ అండ్ ఎగ్జిట్ గైడెన్స్, ఏఐ బేస్డ్ ట్రేడింగ్ సిగ్నల్స్, వ్యూహాత్మక సూచనలను కూడా ఇక్కడ తెలుసుకోవచ్చు. ట్రేడర్లు, ఇన్వెస్టర్లు మరింత జాగ్రత్తగా, సురక్షితంగా, ధైర్యంగా ముందుకు వెళ్లేందుకు ఈ కార్యక్రమం చాలా ఉపయోగపడుతుంది.

## ఆధార్ కొత్త యాప్: ప్రయోజనాలు ఇవే!




ఆధార్ కార్డును ప్రతీచోటుకి తీసుకెళ్లడం బహుశా కష్టం అవ్వొచ్చు లేదా మర్చిపోవచ్చు. దీనిని దృష్టిలో ఉంచుకుని భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ కొత్త ఆధార్ యాప్‌ను ప్రవేశపెట్టింది. ఇది గూగుల్ ప్లేస్టోర్, యాపిల్ స్టోర్ వంటివాటితో అందుబాటులో ఉంది. ఈ విషయాన్ని ఉడాయ్ తన ఎక్స్ ఖాతాలో అధికారికంగా వెల్లడించింది. పేపర్‌లెస్ ఎక్స్‌పీరియన్స్ పొందటానికి ఈ యాప్ ఉపయోగపడుతుందని పేర్కొంది. ఆధార్ వినియోగాన్ని మరింత సురక్షితం చేయడానికి ఉడాయ్ ఈ కొత్త యాప్ తీసుకొచ్చింది. ఈ యాప్ ఉంటే.. ప్రత్యేకంగా ఫిజికల్ ఆధార్ కార్డును వెంటపెట్టుకోవాల్సిన అవసరం లేదు. ఇప్పటికే ఉడాయ్ ఎంఆధార్ పేరుతో ఒక యాప్ పరిచయం చేసింది. ఇప్పుడు తాజాగా.. ఈ కొత్త యాప్ ప్రవేశపెట్టింది. ఇది మీ ఆధార్ వివరాలను భద్రపరచుకోవడానికి, దానిని ఇతరులతో పంచుకోవడానికి ఉపయోగపడుతుంది.

**ఎలా ఉపయోగించాలంటే?**

యాపిల్ యూజర్లు యాపిల్ స్టోర్ నుంచి, ఆండ్రాయిడ్ యూజర్లు ప్లేస్టోర్ నుంచి ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. యాప్ డౌన్‌లోడ్ చేసుకున్న తరువాత.. అవసరమైన టర్మ్ అండ్ కండిషన్స్ యాక్సెప్ట్ చేయాలి. ఇప్పటికే ఆధార్‌తో లింక్ అయిన మొబైల్ నెంబర్ ఎంటర్ చేయాలి. మొబైల్ నెంబర్ వెరిఫికేషన్ పూర్తయిన తరువాత.. ఫేస్ అథంటికేషన్ చేయాల్సి ఉంటుంది. అవసరమైన వివరాలు అన్నీ ఎంటర్ చేసాక, ఒక సెక్యూరిటీ పిన్ సెట్ చేసుకోవాలి. ఈ తరువాత యాప్ ఉపయోగించుకోవచ్చు.



# దేశం-విదేశం

NATIONAL-INTERNATIONAL



## నేడు వైట్ హౌస్‌కు అల్ ఖైదా మాజీ నేత



**వాషింగ్టన్:** రెండు దశాబ్దాల క్రితం అమెరికా దళాలకు వ్యతిరేకంగా పోరాడిన అల్ ఖైదా మిలిటెంట్ అహ్మద్ అల్-షరా వైట్‌హౌస్‌లో సోమవారం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సమావేశమవబోతున్నారు. 1946లో స్వాతంత్ర్యం పొందాక ఆధునిక సిరియా అధ్యక్షుడొకరు వాషింగ్టన్ రావడం ఇదే మొదటిసారి. ఈ కీలక భేటీ కోసం ఆయన శనివారమే అమెరికా చేరుకున్నారు. సిరియాపై ఉన్న ఆంక్షల పూర్తిగా తొలగింపు, ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) ఉగ్రవాద సంస్థకు వ్యతిరేకంగా పోరాడుతున్న అమెరికా నాయకత్వంలోని అంతర్జాతీయ కూటమిలో అధికారికంగా చేరడం ఈ పర్యటన ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి.

**తిరుగుబాటు నేత నుంచి అధ్యక్షుడి దాకా**


అల్ షరా నాయకత్వంలోని తిరుగుబాటు దళాలు గత డిసెంబర్‌లో బషర్ అసద్‌ను గద్దెదించాయి. అంతకుమునుపు, అల్ ఖైదా నేతగా ఉన్న అల్ షరా సిరియాలోని అమెరికా బలగాలతో తలపడ్డారు. ఆయన్ను అంతర్జాతీయ ఉగ్రవాదిగా అమెరికా ప్రకటించింది. ఆయన తలపై రివార్డును కూడా ఉంది. కొంతకాలం అమెరికా బలగాల నిర్బంధంలోనూ ఆయన ఉన్నారు. ఇంతలోనే చకచకా అనూహ్య పరిణామాలు సంభవించాయి. అల్ ఖైదాతో సంబంధాలు తెంచుకున్న అల్ షరా, తాజాగా అంతర్యుద్ధం కారణంగా సిరియాను దూరం పెట్టిన ప్రపంచ దేశాలతో సంబంధాలను తిరిగి నెలకొల్పుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో, మేలో సౌదీ అరేబియాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సమావేశమయ్యారు. దీని తర్వాతే ట్రంప్ దశాబ్దాలుగా సిరియాపై కొనసాగుతున్న ఆంక్షలను ఎత్తివేస్తామని ప్రకటించారు. సోమవారం వాషింగ్టన్‌లో ఆయన ట్రంప్‌తో మళ్లీ భేటీ కానున్నారు. ట్రంప్‌తో జరిగే చర్చల్లో అల్-షరా ప్రధానంగా సీజర్ చట్టం రద్దు కోసం ఒత్తిడి చేయనున్నారు. గత అసద్ ప్రభుత్వం మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడుతోందంటూ అమెరికా ఈ చట్టం కింద తీవ్ర ఆంక్షలను విధించింది.

## హజ్ కోటా నిర్ధారణ.. ఎందరు వెళ్లొచ్చంటే..

**న్యూఢిల్లీ:** హజ్ యాత్ర2026కు సంబంధించి భారత్ కొటా ఎంతనేది నిర్ణారణ అయ్యింది. కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు సౌదీ అరేబియాలో తన అధికారిక పర్యటన సందర్భంగా జెడ్డాలో ద్వైపాక్షిక హజ్ ఒప్పందంపై సంతకం చేశారు. 2026 హజ్ యాత్రకు భారత యాత్రికుల కోటా ఇప్పుడు 1,75,025గా నిర్ధారణ అయ్యింది. మంత్రి రిజిజు నవంబర్ 7 నుండి 9 వరకు సౌదీ అరేబియాలో అధికారిక పర్యటన చేస్తున్నారు. ఈ సందర్భంగా సౌదీ హజ్, ఉమ్రా మంత్రి తౌఫిక్ బిన్ ఫౌజాన్ అల్ రబియాతో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. ఇరుదేశాల సమన్వయం, లాజిస్టిక్స్ ఏర్పాట్లు మొదలైన అంశాలపై దీనిలో చర్చించారు. భారత యాత్రికుల కోసం అవసరమైన ప్రక్రియను క్రమబద్ధీకరించేందుకు ఇరుపక్షాలు తమ నిబద్ధతను పునరుద్ఘాటించాయని ఒక అధికారిక ప్రకటన తెలిపింది. ఈ సమావేశం తర్వాత, రెండు దేశాల ప్రతినిధులు హజ్ 2026 కోసం ద్వైపాక్షిక హజ్ ఒప్పందంపై సంతకం చేశారు. హజ్‌లో అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలను, టెర్మినల్ వన్, హరమైన్ స్టేషన్‌తో సహా జెడ్డా, తైఫ్‌లోని హజ్, ఉమ్రా తదితర ప్రదేశాలను మంత్రి సందర్శించారు. భారత్‌సౌదీ అరేబియా సంబంధాలను మరింతగా పెంచుకోవడంలో ఇది ఒక ముఖ్యమైన అడుగు అని రిజిజు 'ఎక్స్' లో రాశారు.



## మోడల్ ఖుష్బూ దారుణ హత్య, పరారీలో ప్రియుడు



మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో మోడల్ ఖుష్బూ అహిర్వర్ అనుమానాస్పద మరణం కలకలం రేపింది. ఖుష్బూ ఖుషీగా పిలుచుకునే 21 ఏళ్ల మోడల్, ఖుష్బూ అహిర్వర్ సోమవారం తెల్లవారుజామున అనుమానాస్పద పరిస్థితుల్లో శవమై తేలింది. దీంతో ఆమె కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. బాధితురాలి తల్లి లక్ష్మీ అహిర్వర్ తన కుమార్తె హత్యకు గురైందని ఆరోపిస్తోంది. ప్రైవేట్ భాగాలు , శరీరం అంతటా నీలిరంగు మచ్చలు ఉన్నాయనీ ముఖం ఉబ్బి ఉందనీ, తన కుమార్తెను దారుణంగా కొట్టి చంపారు అంటూ కన్నీరుమున్నీరుగా విలపించింది. ఆమెను హత్య చేసిన వారిని శిక్షించాలని, ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్ యాదవ్ జోక్యం చేసుకోవాలని ఆమె సోదరి డిమాండ్ చేసింది. ఆమె కుటుంబం చెప్పిన వివరాల ప్రకారం, ఖుష్బూ 27 ఏళ్ల ఖాసిం అనే వ్యక్తితో లివ్‌ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉంది. చివరిగా అతనే ఆమెను ఆసుపత్రిలో వదిలి వెళ్లాడు. అప్పటినుంచి అతడు పరారీలో ఉన్నాడు. బాధిత మహిళ బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న ఖాసిం కోసం గాలింపు ప్రారంభించారు. ఖుష్బూ గాయాల స్వభావం దాడి, లైంగిక హింసకు సంబంధించిన అనుమానాలను కలిగిస్తోందని పోలీసులు అధికారులు నిర్ధారించారు. పోస్ట్‌మార్టం నివేదిక కోసం వేచి చూస్తున్నామని, లైంగిక దాడి , హత్యతో సహా అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామనితెలిపారు. @DiamondGirl30 అనే తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఫాలోయర్లు కూడా వేల సంఖ్యలో ఉన్నారు. భోపాల్ మోడలింగ్ రంగంలో ఇపుడిపుడే రాణిస్తోంది. బీఏ మొదటి సంవత్సరంలోనే చదువు ఆపేసి గత మూడేళ్లుగా భోపాల్‌లో ఉంటూ పార్ట్‌టైం ఉద్యోగాలు చేస్తూ, మోడలింగ్‌లో అవకాశాలను దక్కించుకుంటోంది. గత మూడు రోజుల క్రితం కుటుంబంతో మాట్లాడింది.

## ఒక్కో అమెరికన్‌కు 2వేల డాలర్లు ఇస్తా



### ట్రంప్ ప్రకటన

**వాషింగ్టన్:** విదేశాలపై సుంకాల భారం మోపడం వల్లే దేశాదాయం విపరీతంగా పెరిగిందని, తద్వారా సమకూరిన ఆదాయం నుంచి అర్హులైన అమెరికన్లకు సుంకాల డివిడెండ్‌గా 2,000 డాలర్లు పంపిణీ చేస్తానని ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ ఆదివారం ప్రకటించారు. విదేశాలపై సుంకాలను ఇష్టారీతిగా పెంచే విచక్షణాధికారం అమెరికా అధ్యక్షుడికి ఉంటుందా? అంతర్జాతీయ అత్యయిక ఆర్థిక అధికారాలు అధ్యక్షుడికి వర్తిస్తాయా? అనే అంశాలపై సుప్రీంకోర్టు లోతైన సమీక్ష జరపనున్న నేపథ్యంలో ట్రంప్ ఆదివారం ఈ మేరకు తనదైన రీతిలో స్పందించారు. సొంత సామాజిక మాధ్యమ 'ట్రూత్ సోషల్' ఖాతాలో ఒక పోస్ట్‌పెట్టారు. ''సుంకాలను వ్యతిరేకించే వాళ్లంతా మూర్ఖులు. అధిక సుంకాలతో రెవిన్యూ వసూళ్ల వరద మొదలయ్యాక మనం అత్యంత ధనిక, గౌరవప్రద దేశంగా మారాం. మన దగ్గర ద్రవ్యోల్బణం దాదాపు లేదు. స్టాక్‌మార్కెట్ దూసుకుపోతోంది. ట్రిలియన్ల డాలర్లు వచ్చిపడుతున్నాయి. త్వరలోనే 37 ట్రిలియన్ డాలర్ల అప్పులను తీర్చే ప్రక్రియ మొదలెడతా. అమెరికాలోకి పెట్టుబడులు పోటెత్తుతున్నాయి. దాదాపు మిగతా వాళ్లందరికీ సుంకాల డివిడెండ్‌గా 2,000 డాలర్లు నేరుగా బదిలీ చేస్తా'' అనిట్రంప్ అన్నారు.

## ఇక వందే మాతరం ఆలాపన తప్పనిసరి




**లక్నో:** సోమవారం ఏక్తా యాత్ర పేరిట గోరఖ్‌పూర్‌లో జరిగిన సామూహిక వందేమాతర ఆలాపన కార్యక్రమంలో సీఎం యోగి ఆదిత్యానాథ్ పాల్గొని మాట్లాడారు. ఐక్యత, దేశభక్తి భావనను విద్యార్థుల్లో నాటేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారాయన. ''వందే మాతరానికి తగినంత గౌరవం ఇవ్వాల్సిన అవసరం ఉంది. అది జరగాలంటే.. ప్రతి విద్యాసంస్థలో దీన్ని తప్పనిసరిగా ఆలపించాలి. దేశభక్తిని పెంపొందించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకోవాల్సి వస్తోంది'' అని అన్నారాయన. ఈ సందర్భంగా.. వందే మాతరం వ్యతిరేకతపై ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. ''ఆల్ ఇండియా ముస్లిం లీగ్ నేతలు మహమ్మద్ అలీ జిన్నా, మహమ్మద్ అలీ జౌహర్ ఈ ఇద్దరూ ఆనాడు వందే మాతరాన్ని వ్యతిరేకించారు.. తీవ్రంగా విమర్శలు గుప్పించారు. 1923లో జౌహర్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు వందే మాతరం ప్రదర్శించిన సమయంలో సభను వదిలి వెళ్లిపోయారు. ఒకరకంగా.. విభజనకు దారితీసిన కారణాల్లో అది కూడా ఒకటి. విభజన భావనలకు తావు లేకుండా, మరో జిన్నా పుట్టకూడదని ప్రజలు బలంగా కోరుకోవాలి. జాతీయ ఐక్యతను సవాల్ చేయాలనే దుస్సాహం ఎవరూ చేయకూడదు. అలాంటి ఆలోచనను కూకటి వేళ్లతో పెకిలించివేయాలి అని అన్నారాయన. ఈ క్రమంలో ప్రతిపక్ష సమాజ్‌వాదీ పార్టీకి ఆయన చురకలంటించారు. సమాజ్‌వాదీ పార్టీకి చెందిన ఓ ఎంపీ జాతీయ గేయానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. వాళ్లు భారత ఐక్యతకు శిల్పి అయిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పట్టించుకోరు. కానీ, జిన్నాను గౌరవించే కార్యక్రమాలకు మాత్రం హాజరవుతుంటారు అని అన్నారాయన. యోగి సర్కార్ తీసుకున్న నిర్ణయం ప్రకారం.. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో వందే మాతరం పాడటం తప్పనిసరి. దీనికి సంబంధించిన మార్గదర్శకాలు త్వరలో విడుదలయ్యే అవకాశం ఉంది.




# కడుపు నిండిపోయింది.. ప్రభాస్ ఆతిథ్యంపై ఫౌజీ భామ ఇమాన్వీ

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ఆతిథ్యం ఎలా ఉంటుందో అభిమానులు, మూవీ లవర్స్‌కు ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఇప్పటికే చాలా మంది సెలబ్రిటీలు ప్రభాస్ ఇంటి భోజనం ఎంత ప్రత్యేకమో పలు సందర్భాల్లో షేర్ చేసుకున్నారు. ప్రభాస్ ఆతిథ్యాన్ని స్వీకరించిన వారిలో తాజాగా అతడి కోస్టార్ ఇమాన్వీ కూడా చేరిపోయింది. ప్రభాస్, ఇమాన్వీ కాంబినేషన్‌లో ఫౌజీ సినిమా వస్తోన్న విషయం తెలిసిందే. ఫౌజీ మూవీ షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో కొనసాగుతోంది. షూటింగ్ బ్రేక్ టైంలో ఇమాన్వీ ప్రభాస్ ఇంట్లో పసందైన భోజనాన్ని రుచి చూసింది. సర్‌ప్రైజింగ్‌గా, సంతోషంగా అనిపించింది.. మీ ఆతిథ్యానికి నా మనస్సు, పొట్ట నిండుగా మారిపోయాయి. ప్రభాస్ గారు మీ ఆతిథ్యానికి ధన్యవాదాలు.. అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది ఇమాన్వీ. ఇప్పుడీ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. హను రాఘవపూడి డైరెక్ట్ చేస్తున్న ఫౌజీ చిత్రంలో శాండల్ వుడ్ భామ, సింగర్ చైత్ర జే అచర్ కీలక పాత్రలో నటిస్తోంది. పీరియాడిక్ యాక్షన్ రొమాంటిక్ డ్రామా వస్తోన్న ఈ మూవీని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్నారు. మేకర్స్ ఈ చిత్రాన్ని 2026 ఆగస్టులో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. ప్రభాస్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. మారుతి డైరెక్షన్‌లో రాజాసాబ్ చేస్తున్నాడు. దీంతోపాటు సలార్ 2, కల్కి 2, స్పిరిట్ చిత్రాలు ట్రాక్‌పై ఉన్నాయి.



# నా చిన్ననాటి కల..
## పెద్దితో నిజమవుతుంది: రామ్ చరణ్

మెగాపవర్ స్టార్ రామ్ చరణ్‌తో దర్శకుడు బుచ్చిబాబు చేస్తున్న చిత్రం పెద్ది. పాన్ ఇండియా లెవల్లో తెరకెక్కుతున్న ఈ సినిమాలో బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. కన్నడ స్టార్ హీరో శివరాజ్ కుమార్ ఇందులో ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే ఏర్పడ్డ భారీ అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా బుచ్చిబాబు పెద్ది చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. ఇక రామ్ చరణ్ కూడా పెద్ది సినిమాపై చాలా నమ్మకంగా ఉన్నాడు. ఇదిలా ఉంటే, తాజాగా హైదరాబాద్‌లో ఆస్కార్ అవార్డు విజేత ఏఆర్ రెహమాన్ మ్యూజికల్ కాన్సర్ట్ జరిగింది. అందులో రెహమాన్ తాను చేసిన పాటలతో ఆడియన్స్‌ను ఉర్రూతలూగించాడు. భారీగా జరిగిన ఈ కాన్సర్ట్‌కు పెద్ది సినిమా టీం రామ్ చరణ్, జాన్వీ కపూర్, బుచ్చిబాబు సనా హాజరయ్యారు. ఈ సందర్భంగా రామ్ చరణ్ మాట్లాడుతూ.. ఏఆర్ రెహమాన్ గారితో సినిమా చేయడం నా చిన్ననాటి కల.. ఆ అవకాశం నాకు బాగా నచ్చిన పెద్ది లాంటి కథతో నిజం అవుతుండటం చాలా సంతోషంగా ఉంది. తాజాగా రిలీజైన చికిరి సాంగ్ అదిరిపోయింది. పెద్ది సినిమా కూడా మీకు తప్పకుండా నచ్చుతుంది, అంటూ రెహమాన్‌పై తనకు ఉన్న అభిమానాన్ని చాటుకున్నాడు. ఈ కామెంట్స్‌తో పెద్ది సినిమా చరణ్‌కు వ్యక్తిగతంగా ఎంతో ప్రత్యేకమైన ప్రాజెక్ట్ అని స్పష్టంగా తెలుస్తోంది. ప్రస్తుతం ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అలాగే పెద్ది సినిమాపై అంచనాలు ఇంకా పెంచుతున్నాయి.



## కొరియన్ భాషలో కూడా నటించాలనుందట..

బాలీవుడ్ నటుడు ఆయుష్మాన్ ఖురానా, రష్మిక మందన్నా కాంబోలో వచ్చిన చిత్రం థామా. హార్రర్ సినిమాటిక్ యూనివర్స్‌లో మ్యాడ్ డాక్ ఫిలిమ్స్ తెరకెక్కించిన ఈ మూవీ అక్టోబర్ 21న విడుదలై బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపించింది. మరోవైపు ఇటీవలే తెలుగులో ది గర్ల్‌ఫ్రెండ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాగా మంచి టాక్‌తో స్క్రీనింగ్ అవుతోంది. బ్యాక్ టు బ్యాక్ సక్సెస్‌లతో ఫుల్ జోష్ మీదున్న రష్మిక ఓ ఆసక్తికర విషయాన్ని అభిమానులు, ఫాలోవర్లతో షేర్ చేసుకుంది. తన ఫిల్మోగ్రఫీలో భిన్నమైన సినిమాలుండేలా ప్లాన్ చేసుకునే రష్మిక కొరియన్ సినిమా చేయడంపై అడిగిన ప్రశ్నకు స్పందించింది. అవును.. కొరియన్ డ్రామా చేయాలనుకుంటున్నా. అవి చాలా ఫన్‌గా ఉంటాయి. కానీ వాళ్లు (మేకర్స్)నాకు ఏం ఇస్తున్నారనే దానిపై కూడా ఇది ఆధారపడి ఉంటుంది. ఎందుకంటే నేను స్క్రీన్‌పై ఏం చేయగలనో మీకు తెలుసు.. కథ నాకు సెట్ అవుతుందనిపిస్తే కొరియన్ ప్రాజెక్ట్ చేసేందుకు రెడీనంటూ చెప్పుకొచ్చింది. నాకు కొరియన్ సినిమాలపై ప్రేమ కోవిడ్‌టైంలోనే మొదలైంది. కోవిడ్ సమయంలో నా చేతిలో చాలా టైం ఉంది కాబట్టి కొరియన్ డ్రామాల గురించి ఆలోచించడం మొదలుపెట్టాను. ప్రతీ కొరియన్ డ్రామా 16 ఎపిసోడ్స్‌గా ఉంటుంది. అంటే మీరు ఒక కొరియన్ ప్రాజెక్ట్‌ను స్క్రీన్‌పై చూడాలంటే రోజులో 16 గంటలు కేటాయించవచ్చన్నది రష్మిక మందన్నా. ఈ కామెంట్స్‌తో ఇక రాబోయే కాలంలో కొరియన్ సినిమాలు కూడా చేసినా ఆశ్చర్యపోనవసరం లేదని రష్మిక హింట్ ఇచ్చేస్తుంది.

# మూడు వేర్వేలు కాలాలు
## ఫాంటసీ మూవీ ట్రైలర్

తెలుగులో 'అమిగోస్', 'నా సామి రంగ' సినిమాల్లో హీరోయిన్‌గా చేసిన ఆషికా రంగనాథ్.. చిరంజీవి 'విశ్వంభర'లోనూ ఓ కథానాయికగా చేసింది. ఈమె నటించిన ఓ కన్నడ మూవీ ఇప్పుడు తెలుగులోనూ విడుదలకు సిద్ధమైంది. అదే 'గత వైభవం'. మూడు వేర్వేరు కాలాల్లో జరిగే ఫాంటసీ కథతో దీన్ని తీశారు. తాజాగా ట్రైలర్ రిలీజ్ చేశారు. నవంబరు 14న ఈ మూవీ తెలుగుతో పాటు కన్నడలోనూ రిలీజ్ కానుంది. ట్రైలర్ చూస్తుంటే కాన్సెప్ట్ పరంగా బాగానే ఉంది గానీ విజువల్స్, కంటెంట్ మాత్రం ఓకే ఓకే అనిపించేలా ఉన్నాయి. ఇదే రోజున దుల్కర్ సల్మాన్ 'కాంత'తో పాటు సంతాన ప్రాప్తిరస్తుతో పాటు పలు చిత్రాలు థియేటర్లలోకి రానున్నాయి. మరి వీటితో పాటు పోటీలో నిలిచి 'గత వైభవం' ఏ మేరకు ఆకట్టుకుంటుందో చూడాలి?



# త్రిష నివాసానికి మరోసారి బాంబు బెదిరింపులు

తమిళనాడు రాజధాని చెన్నైలో మరోసారి బాంబు బెదిరింపులు కలకలం రేపాయి. పలువురు ప్రముఖుల ఇళ్లు, కార్యాలయాలకు గత కొన్నిరోజులుగా వరుస బాంబు బెదిరింపులు వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ప్రముఖ నటి త్రిష నివాసానికి మరోసారి బాంబు బెదిరింపులు వచ్చాయి. తమిళనాడు రాజధాని చెన్నైలో మరోసారి బాంబు బెదిరింపులు కలకలం రేపాయి. పలువురు ప్రముఖుల ఇళ్లు, కార్యాలయాలకు గత కొన్నిరోజులుగా వరుస బాంబు బెదిరింపులు వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ప్రముఖ నటి త్రిష నివాసానికి మరోసారి బాంబు బెదిరింపులు వచ్చాయి.





# డైరెక్టర్‌గా తళపతి కొడుకు..

తమిళ స్టార్ హీరో తళపతి విజయ్.. తన చివరి సినిమా బిజీలో ఉన్నాడు. 'జన నాయగణ్' పేరుతో తీస్తున్న ఈ చిత్రం నుంచి లేటెస్ట్‌గా తొలి పాటని రిలీజ్ చేశారు. లాస్ట్ డ్యాన్స్ పేరుతో 'తళపతి కచేరీ' సాగే ఈ గీతం అభిమానులకు మంచి కిక్ ఇచ్చింది. ఇదలా ఉండగానే ఇప్పుడు విజయ్ కొడుకు తొలి మూవీ నుంచి అప్‌డేట్ వచ్చేసింది. తళపతి విజయ్‌కి జేసన్ సంజయ్ అని కొడుకు ఉన్నాడు. తండ్రిలా ఇతడు కూడా హీరో అవుతాడని అభిమానులు అనుకున్నారు. కానీ దర్శకుడిగా తొలి మూవీ చేస్తున్నట్లు కొన్నాళ్ల క్రితం అందరికీ షాకిచ్చాడు. టాలీవుడ్‌కి చెందిన సందీప్ కిషన్.. ఈ ప్రాజెక్టులో హీరోగా నటిస్తున్నాడు. తాజాగా దీని నుంచి అప్‌డేట్ వచ్చింది. మూవీకి 'సిగ్మా' అనే టైటిల్ ఫిక్స్ చేసి పోస్టర్ రిలీజ్ చేశారు.

ఈ పోస్టర్‌లో డబ్బు, బంగారం లాంటివి చాలా చూపించారు. అలానే సిగ్మా అనే పదాన్ని ఎక్కువగా యాటిట్యూడ్ చూపించే కుర్రాళ్లు, మగాళ్ల గురించి ఉపయోగిస్తారు. చూస్తుంటే ఈ సినిమా కమర్షియల్ ఎంటర్‌టైనర్‌లా అనిపిస్తుంది. తమన్ సంగీత దర్శకుడు కాగా.. లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. తెలుగు, తమిళ భాషల్లో వచ్చే ఏడాది విడుదలయ్యే అవకాశముంది. తండ్రి విజయ్ చివరి సినిమా చేస్తున్నప్పుడే కొడుకు.. దర్శకుడిగా ఇండస్ట్రీలోకి వస్తుండటం ఆసక్తికరంగా మారింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com